

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (బుధవారం)
కనిష్ఠం : 27.0



ఏలేశ్వరంలో క్వారీలు

గుంజేద్దాం!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా అడ్డగోలు సీనరేజీ దోపిడీ
- కాంట్రాక్టు గడువు ఇంకా రెండు నెలలే ఉండడంతో కాసుల కోసం బరితెగింపు
- ఉన్న సమయంలో కోట్లు వెనకేసుకునేలా సీనరేజీ సాకుతో ఎడాపెడా వసూళ్లు
- చెరువులు, పొలాల్లో మట్టి తవ్వుకునే రైతులు, పేదలకూ మినహాయింపు లేదు
- మట్టి తవ్వకానికి కేబినెట్ అనుమతిచ్చినా ఖాతరు చేయకుండా సీనరేజీ దందా
- అనేకచోట్ల రసీదులు సైతం ఇవ్వకుండా కంపెనీ పేరుతో సిబ్బంది నగదు వసూళ్లు
- రౌతులపూడిలో సీనరేజీ పేరుతో దందా చేస్తుండడంపై తిరగబడ్డ లారీ యూనియన్
- అంబాజీపేటలో మట్టి ట్రాక్టర్ల నుంచీ పన్ను వసూలుపై తిరగబడ్డ స్థానికులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ సీనరేజీ పేరుతో ఎడాపెడా దండేస్తోంది.. ఎక్కడికక్కడ జనం ముక్కుపిండి అడ్డగోలుగా దోచేస్తోంది.. సొంత పొలం.. చెరువుల్లోంచి రైతులు, స్థానికులు తట్టెడు మట్టి తీసుకువెళ్తున్నా వాలిపోతోంది.. సీనరేజీ ఫీజులు కట్టాలంటూ రుబాబు చేస్తోంది. ఒకపక్క వాణిజ్యేతర అవసరాలకు రైతులు చెరువుల నుంచి మట్టి తీసుకువెళ్లడానికి ఇటీవల కేబినెట్ అనుమతిచ్చినా తనకేం సంబంధం లేదన్నట్టు దందా చేస్తోంది. ఇంకో రెండు నెలల్లో సంస్థ కాంట్రాక్టు ముగియనున్న నేపథ్యంలో ఈలోపే కోట్లకు కోట్లు దండేసేందుకు బరితెగించేస్తోంది. అనేకచోట్ల రేయింబవళ్లు కంపెనీ పేరుతో సిబ్బంది సీనరేజీ పేరుతో రసీదు లు సైతం లేకుండా నగదు వసూలు చేస్తుండడంతో పలుచోట్ల జనం తిరగబడుతున్న పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖన తప్పించి సుధాకర్ ఇన్‌ఫ్రాకు అడ్డగోలుగా కట్టబెట్టింది. రెండేళ్ల వ్యవధిలో రూ.223 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలనే నెపంతో ఎక్కడికక్కడ పిండేసింది. ప్రభుత్వం మారాక 73 రోజులు కాంట్రాక్టు గడువు పెంచడంతో దందా కొనసాగిస్తోంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చిన్న తరహా ఖనిజాలు, గనులు, క్వారీలు, లేటరైట్, ఇతర గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి గనులశాఖ ఎన్నో ఏళ్లుగా సీనరేజీ వసూలు చేసేది. తద్వారా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆదాయం వచ్చేది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖను తప్పించేసింది. వీటి నుంచి భారీగా నిధులు బొక్కేయడం కోసం పథకం పన్ని ఏకంగా ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టింది. ఎవరికి తెలియకుండా అడ్డగోలుగా 2023 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు కాంట్రాక్టును ఏకంగా సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీకి అప్పగించేసింది. రెండేళ్లపాటు ఈ కాంట్రాక్టు ఉండేలా ఆదేశాలు జారీచేసింది. ఇందుకుగాను రెండేళ్లకు ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లించేసి ఆపై ఎంత వసూలు చేసుకున్నా తనకు సంబంధం లేదన్నట్టు స్పష్టం చేసింది. పైగా రూ.233 కోట్లు ఒకేసారి కాకుండా నెలకు రూ.9.70కోట్ల చొప్పున ప్రభుత్వానికి కట్టేలా వెసులుబాటు కల్పించింది. సదరు కంపెనీ వెనుక ఉన్న ఓ కీలక వైసీపీ నేత చేతికి అధికారం దక్కడంతో రెచ్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో క్వారీలు, మైనింగ్ జరిగే ప్రాంతాలు, చెరువులు, కొండలు ఉన్నచోట్ల ఏకంగా భారీగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ప్రైవేటు సైన్యాన్ని దింపి ప్రతి లారీ నుంచి ముక్కుపిండి సీనరేజీని ఈ కంపెనీ వసూలుచేసింది. ఈ కంపెనీ రాకముందు నెలకు ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు పర్యవేక్షణ లేక, సిబ్బంది కొరతతో పట్టించుకోక రూ.3 కోట్లు కూడా వచ్చేది కాదు. కానీ సదరు ప్రైవేటు సంస్థ ఏకంగా ముక్కుపిండి నెలకు రూ.15కోట్ల వరకు పిండేసింది. ఇలా గతేడాది అసెంబ్లీ ఫలితాలు వచ్చేవరకు ఆడింది ఆట పాడింది పాట అన్నట్టు రెచ్చిపోయి ఉమ్మడి జిల్లాను కుమ్మేసింది. కోట్లకుకోట్ల సీనరేజీ పిండేసింది. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఈ సంస్థ ఆగడాలు ఆగినట్టేనని అంతా భావించారు. అప్పటి ప్రభుత్వం అడ్డగోలుగా కట్టబెట్టిన కాంట్రాక్ట రద్దవడం ఖాయం అని అనుకున్నారు. సుధాకర్ ఇన్‌ఫ్రా సైతం ప్రభుత్వం మారడంతో భయపడి తగ్గింది. మే, జూన్, జూలై నెలల్లో ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూళ్లు నిలిపివేసింది. కానీ మళ్లీ అదే కంపెనీ పైరవీలు నడిపింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మూడు నెలలపాటు సీనరేజీ వసూళ్లు నిలిపివేసినందున ఆ సమయానికి తమకు సీనరేజీ వసూలు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. అటు ప్రభుత్వానికి సీనరేజీ బాకీలు కూడా ఉండడంతో అవి చెల్లించడానికి గడువు పొడిగించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఈనెల నుంచి జూలై 14 వరకు 73 రోజులపాటు సీనరేజీ వసూలు చేసుకునేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. జూలై 14 తర్వాత కాంట్రాక్టు రద్దవుతుందని స్పష్టంచేసింది.



గడువులోగా కుమ్మేద్దాం..

పొడిగించిన గడువు మరో రెండు నెలల్లో ముగియనుండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఇప్పుడు అడ్డగోలుగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో బరితెగించేస్తోంది. ఉన్న తక్కువ సమయంలో ఎక్కువ పిండేసేందుకు వీలుగా దౌర్జన్యాలకు తెగబడుతోంది. ఎక్కడికక్కడ కంపెనీ పేరుతో సిబ్బంది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాహనాల్లో తిరుగుతూ డబ్బులు కట్టాలంటూ చెరువులు, కాలువలు, కొండలు, గుట్టల వద్ద దందాలు చేస్తున్నారు. చేతిలో కనీసం రసీదు పుస్తకం కూడా లేకుండా నగదు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రౌతులపూడిలో కొండల నుంచి గ్రావెల్ తరలిస్తోన్న లారీలను సుధాకర్ ఇన్‌ఫ్రా పేరుతో కొందరు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. రసీదులు లేకుండా డబ్బులు అడుగుతున్నారని లారీ యూనియన్ తిరగబడడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అలాగే కాకినాడ జిల్లా జగ్గంపేట, రౌతులపూడి, పెద్దాపురం మండలాల్లో చిన్నాచితకా క్వారీల నుంచి నల్లరాయి, గ్రావెల్, తూర్పుగోదావరిలో కొండల నుంచి చిన్నపాటి గ్రావెల్, మట్టి... కోనసీమలో చెరువుల నుంచి మట్టి తరలిస్తున్న వారిని సైతం వదలకుండా నగదు డిమాండ్ చేస్తుండడంతో సదరు కంపెనీ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏమాత్రం బిల్లులు లేకుండా అడ్డదారిలో డబ్బులు వసూలు చేయడం ఏస్థాయిలో సీనరేజీ పేరుతో సదరు సంస్థ కోట్లకుకోట్లు దారిమళ్లిస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటు రైతులు వాణిజ్యేతర అవసరాలు చెరువుల్లో మట్టి తవ్వి తరలించుకోవచ్చని ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయినా ఈ కంపెనీ మాత్రం తనకు డబ్బు కట్టాల్సిందేనంటూ బరి తెగించేస్తోంది.

ఆ రూ.24 కోట్ల పేరుతోను..

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో అరబిందో సంస్థకు గత వైసీపీ ప్రభుత్వం ఓ కొండను రాసిచ్చేసింది. కాకినాడ సెజ్‌లో నిర్మిస్తోన్న పోర్టు కోసం ఇక్కడి నుంచి కావలసినంత రాయిని తవ్వుకోవడానికి వీలుగా రూ.71 కోట్ల వరకు సీనరేజీ పన్ను రద్దు చేసేసింది. ఇలా చేయడం వల్ల తనకు రావలసిన ఆదాయానికి గండిపడిందని సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా రూ.24కోట్ల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించలేదు. తాను కట్టాల్సిన బాకీలో ఈ మొత్తం రద్దు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరింది. అయినా పట్టించుకోకపోవడంతో కొత్త ప్రభుత్వం వద్ద పైరవీలు చేసింది. వినకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ మొత్తం డబ్బులు ఒకవేళ తాను కట్టాల్సివస్తే నష్టపోతామనే కారణంతో కాంట్రాక్టు మిగిలి ఉన్న ఈ రెండు నెలల్లో ఎంత వీలైతే అంత అడ్డగోలుగా పిండేయాలని సదరు సంస్థ పన్నాగం పన్నింది. అందుకే ఉమ్మడి జిల్లాల్లో సీనరేజీ పేరుతో నగదు వసూళ్లకు తెగబడుతోంది.

కోనసీమలోనూ అదే తీరు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సెస్ వసూలుకు వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు పొందిన సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పేరిట జరుగుతున్న దందా విమర్శలకు దారితీస్తోంది. ఇటీవల ఓ వివాదం పోలీసుస్టేషన్‌కూ చేరింది. పి.గన్నవరం మండలం నుంచి ఓ రైతుకు చెందిన పొలం నుంచి నల్లమట్టిని ట్రాక్టర్లపై అంబాజీపేట హైస్కూలుకు తరలిస్తుండగా వాటిని ఆపిన సుధాకర్ ఇన్‌ఫ్రా సిబ్బంది వారికి సొమ్ములు చెల్లించాలని డ్రైవర్లను అడిగారు. దాంతో డ్రైవర్లకు, సంస్థకు చెందిన వారికి మధ్య ఘర్షణ తలెత్తడంతోపాటు వారి ప్రైవేటు వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఆ ట్రాక్టర్ల డ్రైవర్లు, వాటి యజమానిపై పోలీసులు కేసు నమోదుచేశారు. దీంతో తమ పొలంలో మట్టి తీసుకుని తరలిస్తే సెస్ ఎందుకు చెల్లించాలని రైతులు నిలదీస్తున్నారు.

రైతన్నలకు అండగా ఉంటాం!

- ప్రతి ధాన్యం గింజా కొంటాం
- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 14(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతన్నకు విత్తనం నుంచి విక్రయం వరకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దగాపడిన రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొంటుందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో మరో 8025 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నామని వెల్లడించారు. నిడదవోలు మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, పెరవలి మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, ఉండ్రాజవరం మండలంలో 6,025 మెట్రిక్ టన్నులు అదనపు ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎవరు అధైర్య పడవద్దని, గతంలో పడిన పాట్లు ఏ ఒక్క రైతు పడకూ డదనే ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలుకానుందని తెలిపారు.

జిల్లాలో 3.17 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

రాజమహేంద్రవరం, మే14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం 2332.840 టన్నుల ధాన్యాన్ని సేకరించామని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. దీంతో ఇప్పటివరకూ 27,397 మంది రైతుల నుంచి 3,17,462.8 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి రూ.730.85 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకూ రూ.603.67కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఆదేశాలతో ఈసారి అధిక మొత్తంలో ధాన్యాన్ని సేకరిస్తున్నామని, అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టంచేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 527 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలకు జిల్లాలో 527 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. మొదటి ఏడాది 9811, రెండో ఏడాది 978, వొకేషనల్ మొదటి ఏడాది 493, రెండో ఏడాది 255 మంది హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

రెండు లారీలు ఎదురెదురుగా ఢీ

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ 7

అద్దెల పేరుతో దుబారా!

- జిల్లాలో పలు శాఖల తీరు
- ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నా
- కిరాయిలు చెల్లింపునకే మొగ్గు
- నెలకు లక్షల్లో ప్రజాధనం వృథా
- కొన్ని శాఖల తీరుపై జనం విస్మయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వృథాను అరికడితే పొదుపు చేసినట్టేనని పెద్దలు చెబుతుంటారు. నిజమే ఆర్థిక పరిస్థితి బాగోని సమయంలో ఆ మాటను పక్కాగా పాటించకపోతే ఇంకా ఇబ్బందుల్లో కూరుకుపోతాం. గత వైసీపీ ప్రభుత్వం పోతూ పోతూ పెద్ద అప్పుల అగాథాన్ని కూటమి ప్రభుత్వానికి అప్పగించింది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టే నాటికి ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా ఉన్నా.. సంక్షోభాల నుంచే అవకాశాలను సృష్టించుకోవాలని చెప్పడమే కాకుండా చేసిచూపించే సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో వృథా ఖర్చులు తగ్గించుకోవాలని, ఉన్నదాంట్లో సర్దుకొని పనిచేయాలని పదే పదే చెబుతూనే ఉన్నారు. కానీ జిల్లా యంత్రాంగానికి మాత్రం ఆ మాటలు పెద్దగా చెవికెక్కడం లేదని ప్రభుత్వ కార్యాలయాలకు చెల్లిస్తున్న అద్దెలు చెబుతున్నాయి. శుభ్రం చేసి సున్నం వేసుకుంటే ఎంచక్కా విధులు నిర్వహించుకొనే అవకాశం ఉన్న భవనాలు కళ్ల ముందు కనబడుతున్నా కొన్ని శాఖల అధికారుల్లో మాత్రం విలాస భవంతి లేకపోతే కులాసాగా పని చేయమనే ధోరణి జనాన్ని విస్మయానికి గురిచేస్తోంది.

● అద్దెల చెల్లింపే సౌఖ్యమట!

జిల్లాల విభజన తర్వాత ఉన్నపళంగా కొత్త ప్రాంతానికి ఫైల్సు సర్దుకొని వచ్చేయాల్సిన పరిస్థితి తెలిసిందే. దీంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలను ప్రారంభించారు. బొమ్మూరులోని న్యాక్ భవనాన్ని కలెక్టరేట్‌కి కేటాయించారు. వాస్తవానికి ప్రజలు వెళ్లడానికి రవాణాపరంగా ఏమాత్రం అనుకూలంగా కలెక్టరేట్ ఉండదు. కానీ తప్పని పరిస్థితుల్లో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. జిల్లా స్థాయి కార్యాలయాలను కొన్నిటిని కలెక్టరేట్‌లో, మరికొన్నిటిని అక్కడికి కాస్త దగ్గరలోని వైటీసీ భవనంలో ఏర్పాటుచేశారు. జిల్లా స్థాయి అధికారుల చాంబర్లు కూడా ఇప్పటికీ చిన్న గదుల్లోనే ఉన్నాయి. అసలు మరుగుదొడ్ల సదుపాయం సరిగా లేదు. ఒక్కసారి ఇంటి నుంచి ఆఫీసుకు వచ్చారంటే భోజనం తెచ్చుకున్నా లేకపోయినా మళ్లీ ఆఫీస్ సమయం అయ్యే వరకూ ఇంటికి వెళ్లే పరిస్థితి ఉండదు. అల్పాహారం తినాలన్నా తిప్పలే. హోటళ్లు ఎక్కడో దూరంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో సైతం అధికారులు నెట్టుకొస్తున్నారు. కొందరు అధికారులు సొంత సొమ్ములతో కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్నారు. ఒక జిల్లా అధికారి కార్యాలయం అయితే నిన్న మొన్నటి వరకూ మేజర్ డ్రైన్ పక్కనే ఉండేది. అయితే, కొందరు అధికారులు ఇలా సర్దుకుపోతుంటే.. మరి కొందరు అధికారులు మాత్రం అద్దె చెల్లించినా ఫర్వాలేదు.. సౌఖ్యాలు ఉండాల్సిందే అంటున్నారు.

● భవనాలు అందుబాటులో ఉన్నా

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ప్రభుత్వానికి చెందిన భవనాలు చాలా ఉన్నాయి. అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని భవనాలకు సున్నంవేసి, శుభ్రం చేయించుకుంటే వినియోగించుకోవచ్చు. సెంట్రల్ జైలు ఎదురుగా ఆర్అండ్‌బీకి చెందిన భవనాలు చాలా ఉన్నాయి. కంబాల చెరువు సమీపంలో దాదాపు పూర్తి కావొచ్చిన భవనం ఉంది. ఫైర్ ఆఫీస్ పక్కన రైల్వేకి చెందిన భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇవి ప్రజల రాకపోకలకు కూడా సౌకర్యవంతంగా ఉంటాయి. వీటికి స్వల్ప మొత్తంలో నిధులు కేటాయిస్తే లక్షల్లో ప్రజల సొమ్ము ఆదా అవుతుంది. కానీ అదేమీ కొందరు అధికారులకు పట్టడం లేదు. ఉదాహరణ కు ఎక్సైజ్ జిల్లా కార్యాయం దానవాయిపేటలోని ఓ భవనంలో ఏర్పాటుచేశారు. ఈ భవనానికి సుమారు రూ.40 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఎక్సైజ్ జిల్లా కార్యాలయానికి ప్రజల రాకపోకలు ఉండవు. కానీ వైటీసీలో కేటాయించిన మూడు గదులు కాదని.. నగరంలో ఓ విలాసవంతమైన భవంతిని అద్దెకు తీసుకు న్నారు. తక్కువ అద్దెకు దొరికే ప్రాంతాలు ఉన్నా హోదాకు తగినట్టుగా ఉండాలని రిచ్ ఏరియాని ఎంచుకొన్నారు. అలాగే అర్బన్ తహశీల్దారు కార్యాలయం పక్కన రిజిస్ట్రేషన్ల శాఖకు సొంత భవనం ఉంది. దానిని పాడుబడిన భవనంగా చేయడంలో భాగంగా వదిలేసి అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 11 ఎస్ఆర్‌వో, 2 ఆర్‌వో కార్యాలయాలు ఉండగా 11 కార్యాలయాలకు అద్దెలు కడుతున్నారు. రాజమహేంద్రవరంలోని రిజిస్ట్రారు కార్యాలయానికి ఏకంగా రూ.50 వేలు, జిల్లా రిజిస్ట్రారు కార్యాలయానికి రూ.24 వేలు అద్దెలుగా చెల్లిస్తున్నారు. జిల్లా మైన్స్ కార్యాలయం లాలాచెరువు సమీపంలోని ఓ భవనంలో ఉంది. దీనికి సుమారు రూ.50 వేలు అద్దె కడుతున్నారు. కానీ చాలా మటుకు అక్కడ ఒక అటెండర్ మాత్రమే దర్శనమిస్తారు. గదుల్లోని కుర్చీలన్నీ ఖాళీగా ఉంటాయి. అధికారులు కలెక్టరేట్ నుంచి పనిచేస్తుంటారు. ఈ విషయంలో అర్బన్ తహశీల్దారు కార్యాలయాన్ని మెచ్చుకొని తీరా ల్సిందే. ఇది విధులు నిర్వర్తించడానికి ఏమాత్రమూ సదుపాయంగా ఉండదు. వర్షాకాలం వచ్చిందంటే పడవల్లో ఆఫీసుకు చేసుకొనే పరిస్థితి ఉంది. సీలింగ్ నుంచి వర్షం నీరు ధారాపాతంగా కారుతుంది. ఏళ్ల తరబడి ఆ కార్యాలయంతోనే వేగుతున్నారు.

● లెక్కలు లేవు

జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వాటి అనుబంధ శాఖలకు సంబంధించి 50 వరకూ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో చాలా మటుకు జిల్లా కలెక్టరేట్, వైటీసీ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కానీ కొన్ని శాఖల కార్యాలయాలు మాత్రం అద్దె భవనాల్లో ఉన్నాయి. ఎన్ని అద్దె భవనాల్లో ఉన్నాయి, వాటికి నెలకు ఎంత జనం సొమ్ము అద్దెలుగా చెల్లిస్తున్నారనే లెక్కలు స్పష్టంగా లేని పరిస్థితి ఉంది. ఏ శాఖకు చెందిన బడ్జెట్‌లో ఆ శాఖ చెల్లించుకుంటుందని, అందువల్ల జిల్లా కలెక్టరేట్‌లో కూడా వివరాలు ఉండవనే సమాధానం ఎదురవుతోంది. కలెక్టర్ ప్రశాంతి అద్దెల పేరుతో దుబారాపై దృష్టి సారించాలనే వాదన వినవస్తోంది. అందుబాటులో ఉన్న భవనాలను శిథిలాలకు వదిలేయకుండా బాగు చేయించి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే జనం సొమ్ము పెద్ద ఎత్తున ఆదా అయ్యే అవకాశం ఉంది.



మన్యం వీరుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న వాసు, సోము

అల్లూరి పోరాటం.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

● అల్లూరి, మన్యం వీరుల విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు 6

నవోదయం 2.0లో పురోగతి సాధించాలి : జేసీ

రాజమహేంద్రవరం,మే14(ఆంధ్రజ్యోతి): ఇటీవలకాలంలో యువత, పిల్లల్లో, స్కూల్, కళాశాల విద్యార్థుల్లో మత్తు పదార్థాల వినియోగం ఆందోళన కలిగిస్తోందని, మద్యం, నిషేధిత మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న నవోదయం 2.0లో పురోగతి సాధించాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. బుధవారం ఎక్సైజ్ అధికారులతో ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మద్యం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికోసం వివిధ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నవోదయం అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొన్న వారి సంఖ్య, డీ-ఎడిక్షన్ సెంటర్లలో చేరిన వారి సంఖ్య, విజయవంతంగా పునరావాసం పొందిన వారి సంఖ్య హేతుబద్ధతతో విశ్లేషణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈపీవో లావణ్య, అదనపు ఎస్పీ (శాంతి భద్రతలు) డి.సుబ్బరాజు, డీఎస్ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ చిన్న రాముడు

డ్వామా సిబ్బందికి అందని జీతాలు

రాజమహేంద్రవరం రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో పనిచేసే అధికారులు, సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న అటెండర్లు మొదలుకొని హెచ్ఆర్ పాలసీ కింద పనిచేసే టీఏలు, ఈసీలు, ఏపీవోలు ఇతర సిబ్బంది కలిసి 400 మంది ఈ శాఖ పరిధిలో పనిచేస్తున్నారు. వీరికి మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి జీతాలు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇవి కాటేస్తే...

జంతువులు.. కీటకాలు.. విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ మార్పులతో అప్పుడప్పుడూ వానలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పాములు, తేళ్లు, జర్రులతోపాటు పలు రకాలు విషపూర్తి కీటకాలు భూమిలోనుంచి జనావాసాల్లోకి వస్తుంటాయి. ఇవే కాక పెంపుడు కుక్కలు, వీధి కుక్కలు వంటివి ఒక్కోసారి ప్రమాదవశాత్తూ కరుస్తుంటాయి. ఇలా జంతువులు, కీటకాల కాట్లకు గురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రి సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్క కరిస్తే యాంటీ రేబిస్ ఇంజక్షన్, విషసర్పాలు కరిస్తే యాంటీ స్నేక్ వ్యాక్సిన్, తేళ్లు వంటివి కరిస్తే దానికి సంబంధించిన ఇంజక్షన్లు చేస్తారు. ఇంకా దీనికి సంబంధించిన వివరాలు తెలుసుకుందాం..

ప్రాణ సంకటమే!



- జంతువులు.. కీటకాలతో జాగ్రత్త అవసరం
- వేసవిలో వర్షాలు... జనావాసాల్లోకి విష సర్పాలు
- గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువ
- కుక్కలతోనూ జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- విషపూరిత కీటకాలు కాటేస్తే తక్షణ వైద్యం అవసరం
- అందుబాటులో వైద్యం.. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం
- వెంటనే చికిత్స చేయించుకోవడం ఉత్తమం



జీజీహెచ్ (కాకినాడ)-ఆంధ్రజ్యోతి

శునకాలను చాలా మంది ఇళ్లల్లో ఇష్టంగా పెంచుకుంటూ ఉంటారు. ఒక్కోసారి అది కరిస్తే పెంపుడు జంతువే కదా అని అశ్రద్ధ చేస్తారు. అది హాని చేసినా పట్టించుకోకపోతే భారీ మూల్యం చెల్లించకతప్పదు. విషసర్పాలు కాటు వేసినా మా ఇలవేల్పే కదా అని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణం మీదికి తెస్తుంది. వృశ్చికం (తేలు) పరిస్థితి కూడా అంతే. ఇకపోతే దోమే కదా అది కాటేస్తే ఏమౌతుందిలే అని తేలిగ్గా తీసిపారేస్తాం. కానీ ఇవే చాప కింద నీరులా విషజ్వరాలుగా మారి ప్రాణాల మీదికి తెస్తుంది. మనిషి ఇన్ని ప్రాణాపాయాల నుంచి బయట పడాలంటే ప్రాథమిక దశలో తీసుకునే వైద్యుల సలహాలు, సూచనలే శ్రీరామరక్షగా ఉంటాయి.

● పాముకాటు వేస్తే..



అని పాములు విషపూరితమైనవి కావు. విషసర్పం కాటు వేస్తే శరీరంపై కాటు గుర్తులు పడతాయి. అక్కడ వాపు లేదా రక్తస్రావం జరగొచ్చు. విషం శరీరంలోకి మెల్లగా పాకే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి. వికారం, వాంతులు, తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, కండరాల బలహీనత వంటివి జరిగే అవకాశం ఉంటుంది. పాము కాటు వేసిన తర్వాత తొందరలో కొన్ని పొరపాట్లు చేయకూడదు. కాటు వేసిన ప్రాంతాన్ని కడగకూడదు. రక్తప్రవాహాన్ని ఆపడానికి కట్లు కట్టడం వంటివి చేయకూడదు. విషం పీల్చడానికి ప్రయత్నించవద్దు. బాధితు డిని ఆందోళన చెందనివ్వరాదు. ఎటువంటి మంత్రానికి తీసుకుని వెళ్లరాదు. వెంటనే దగ్గరలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా అర్హుడైన వైద్యుడి వద్దకు తీసుకువెళ్లాలి. వీలైతే కాటువేసిన పాము జాతి లేదా ఏ రంగులో ఉందో వైద్యులకు తెలియజేయాలి. వైద్యపరీక్షల అనంతరం పాము ద్వారా ఎక్కిన విషాన్ని బట్టి అక్కడ వైద్యులు పెద్దాస్పత్రికి సిఫార్సు చేస్తారు. తద్వారా శరీరంలో ఎక్కిన విషాన్ని బట్టి యాంటీ స్నేక్ వేనం (ఏఎస్‌వీ) వ్యాక్సిన్‌ను వైద్యుల పర్యవేక్షణలో ఇస్తారు.

● ప్రమాదకరం పాముకాట్లు

వేసవికాలమైనా ఇప్పుడు కూడా ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. పొలాల్లో రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమ య్యారు. ఈ క్రమంలోనే అప్రమత్తంగా లేనివారు పాము కాట్లకు గురైన కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పొలం పనుల తోపాటు గ్రామీణ ప్రాంతంలో పాత నివాసగృహాలు, పరిసరాలు శుభ్రత పాటించలేని ఇళ్లవద్ద జనం పాముకాట్లకు గురైన మృతి చెందిన సంఘటనలున్నాయి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ ఆసుప త్రుల్లో పాముకాట్లకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నా సకాలంలో సరైన వైద్యం అందక ఏదో ఒకచోట పాముకాటుకు గురై ఎవరో ఒకరు మృతి చెందుతూనే ఉన్నారు.

● రెండు రకాల విషసర్పాలు

పాములు రెండు రకాలు ఉండగా న్యూరోటాక్సిల్ రకం.. నాగుపాము, కట్ల పాము... రెండో రకం హిమోటాక్సిన్ అంటే రక్తపింజర వంటి పాములు ఉన్నాయి. న్యూరోటాక్సిల్‌తో నోటి ద్వారా నురగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. హిమోటాక్సిల్‌తో క్షణాల్లో కణజాలం నశించి కాటుపడిన భాగంలో వాపు వస్తుంది. ఎలాంటి పాము అని తెలుసుకుంటే చికిత్స చాలా సులభంగా ఉంటుందని వైద్యులు చెప్తున్నారు. పక్కపక్కనే రెండు దంతాల కాట్లు కనిపిస్తే ఇక అది కచ్చితంగా విషపురుగే. ఎలాంటి పాము కాటేసినా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే.

● ధైర్యమే రక్ష

సాధ్యమైనంత వరకు పాములు, విషకీటకాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట పొలాలకు వెళ్లే వారు కర్ర, టార్చ్‌లైటు తీసుకెళ్లాలి. ఇంటి ఆవరణంలో ముళ్లపొదలు, రంధ్రాలు, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. ఒకవేళ పాముకాటుకు గురైనప్పుడు ఆందోళనకు గురి కాకూడదు, ఆ ప్రమాదం గుండెపోటుకు దారితీస్తుంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చిక్సితలు చేయించాలి. పాము కరిచిన వారిలో ఎక్కువ శాతం భయందోళనకు గురై మరణించే అవకాశం ఉంది. వారికి ధైర్యం చెప్పి వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. పాము కరిచిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లితే 99 శాతం బతికే అవకాశం ఉందని, పాము ఎలాంటిదైనా చికిత్సలు చేయిస్తేనే ప్రాణాలు పదిలం అంటున్నారు వైద్యులు. ప్రతిఏటా పాము కాట్లకు గురవుతున్న వారిలో 80 శాతంపైగా ప్రాణాలు పోగొట్టుకుటుంటున్నది గ్రామీణులే అని వైద్యులు చెబుతున్నారు.

● మందులు ఉన్నాయి

పాము కాటుకు సంబంధించి మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పాముకాటుకు గురైన వెంటనే సకాలంలో ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకువచ్చి(యాంటీ స్నేక్ వీనం) ఇంజక్షన్లు వేయించుకోవాలి. మూఢనమ్మకాలు, నాటువైద్యం నమ్మకుండా దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాలి. ప్రధానంగా రైతు, రైతు కూలీలు పొలాలకు వెళ్లేటప్పుడు, ఇండ్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుంటే పాముకాటు నుంచి రక్షణ చేసుకోవచ్చు.

● కుక్క కాటుకు..

ప్రమాదవశాత్తూ కుక్క కరిస్తే పెంపుడు కుక్కే కదా అని అశ్రద్ధ చేయకూడదు. పెద్ద గాయం లేదా ముఖానికి దగ్గరగా గాయమైనా దగ్గరలోని పీహెచ్‌సీ లేదా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్తే అక్కడ ఇమ్యునో గ్లోబ్యూలిన్స్ గాయం చుట్టూ ఇచ్చి అనంతరం టీటీ ఇంజక్షన్ ఇస్తారు. అనంతరం నాలుగు దఫాలుగా యాంటీ రేబిస్ (ఏఆర్‌వీ) వ్యాక్సిన్‌ను క్రమం తప్పకుండా వేయించుకోవాలి. కొన్ని రకాల ఆహారాలు తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అలా కాకుండా నిర్లక్ష్యం చేసి వ్యాక్సిన్ వేయించుకోకుండా ఉంటే రేబిస్‌కు గురై మరణించే అవకాశం ఉంటుంది.

● దోమలు ప్రమాదమే...



ఇక అతి ముఖ్యమైనది రకరకాల దోమ జాతులు వానాకాలం, శీతాకాలంలో వృద్ధి చెంది అవి కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా తదితర విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుంది.

● తేలు కరిస్తే...



చిన్నచిన్న తేళ్ల వల్ల పెద్దగా ప్రమాదం ఉండదు. అదే పెద్ద తేలు కుడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న వైద్యుడ్ని సంప్రదించాలి. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆయన సిఫార్సు మేరకు పెద్దాసుపత్రిలో చేరడం ద్వారా మెరుగైన చికిత్స అంది ప్రాణాపాయం తప్పుతుంది.

అల్లూరి పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

● కంబాలచెరువు వద్ద సీతారామరాజు విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు వద్ద ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, మన్యం వీరుల విగ్రహాల సముదాయం

రాజమహేంద్రవరంసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన వీరోచిత పోరాటం భవిష్యత్‌తరాలకు స్ఫూర్తి దాయకమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం కంబాలచెరువుచిరంజీవి పార్కును రూ.కోటీ 25లక్షలతో అభివృద్ధిచేసి అక్కడ ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, ఆయన అనుచరులు మన్యంవీరుల విగ్రహాలను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో రాజమహేంద్రవరానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంతాలలో ఆయన సంచరించారని గుర్తుచేశారు. అటువంటి పోరాటయోధుల విగ్రహాలను చూసి భవిష్యత్‌తరాలు స్ఫూర్తినొందాలని మన్యం వీరుల విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.75లక్షలు, రుడా నుంచి మ్యాచింగ్ ఫండ్స్ రూ.50లక్షలు కలిపి మొత్తం రూ.కోటి 25లక్షలతో పార్కు అభివృద్ధి చేశామన్నారు. చిరంజీవి పార్కుకు చరిత్ర ఉందన్నారు. గతంలో ఈ పార్కును అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి ప్రారంభించాల్సివుండగా కొన్ని అనివార్యకారణాల వల్ల పార్కు ప్రారంభం కాలేదన్నారు. అప్పటి నుంచి ఈపార్కు బాగోగులు చిరంజీవి అభిమానులే చూస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పార్కును అభివృద్ధి చేశామన్నారు. అదేవిధంగా అమృత పథకం 2.0లో కేంద్రం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు గ్రాంటు కేటాయించిందని అందులో రాజమహేంద్రవరానికి రూ.200 కోట్లు కేటాయించిందని, ఇది శుభపరిణామమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడిన యోధుడు అల్లూరి అని అన్నారు. అల్లూరి సీతారామరాజు తోపాటు మన్యంవీరుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటుచేయడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరీకరణ అనేది చాలా వేగంగా జరుగుతుందన్నారు. పట్టణాలకు పల్లె ప్రాంతాల నుంచి ప్రజలు నివాసానికి వస్తున్న తరుణంలో పార్కులను, స్పోర్ట్స్‌కు సంబంధించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా రుడా, నగర పాలక సంస్థ అథారిటీ వారికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి పేరున ఉన్న పార్కును ప్రారంభించామన్నారు. జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను మాట్లాడుతూ 2002లో మెగాస్టార్ చిరంజీవి ఇదే పార్కులో ప్రస్తుతం ఉన్న మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించలేని విధంగా అభిమానులు కిక్కిరిశారని ఆనాటి రోజును గుర్తుచేశారు..

ప్రాథమిక హక్కుల పరిరక్షణే కమిషన్ ధ్యేయం



అధికారులతో చర్చిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతి సయాని

● ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను అందించడంలో ప్రభుత్వశాఖలు వివక్ష ధోరణి చూపుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామని.. ప్రజలు ఆ హక్కులను పొందేవిధంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సీ) కృషి చేస్తోందని కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని పేర్కొన్నారు. రెండురోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి ఆమె రాజమహేంద్రవరం చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవహక్కుల విషయంలో ఉల్లంఘన జరిగితే ఎన్‌హెచ్ ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరుల ఇబ్బందులపై కేసులను సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తామ న్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించాల్సిన సేవల లోపాల విష యంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటివరకూ 39 గిరిజన వసతిగృహాలు, ఎస్సీ కాలనీలు, పాఠశాలలు, మండల తహ శీల్దారు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలుచేసి పౌరుల సమస్యలు తెలుసుకున్నామని, వాటిపై కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. పింఛన్లు అందక ఇబ్బంది పడుతున్న అర్హులకు కూడా పరిష్కారం చూపుతామన్నారు. మహిళల గౌరవానికి, భద్రతకు భంగం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే నేరుగా కమిషన్‌కి అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుందని, ఏ రాష్ట్రంలోనూ అనుబంధ సంఘాలు లేవని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లోని కమిషన్ వెబ్‌సైటు nhrc.netలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తొలుతగా జిల్లా అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలతో ఆమె బుధవారం రాత్రి సమావేశమయ్యారు. వారి సమస్యలు, నిర్వహణ, విధుల్లో ఇబ్బందులు, బలహీనవర్గాల సమస్యలు, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ప్రజల స్థితిగతులపై చర్చించారు. అధికారులకు తెలియజేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని అంగన్వాడీ కార్యకర్తలతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి పేర్కొన్నారు.



ఐదో యూనిట్‌లో టర్బన్ పనులు, కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

రూ.510 కోట్లు 2 యూనిట్లు

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో శరవేగంగా 5, 6 యూనిట్ల పనులు

మోతుగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పరిధి సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో 5,6 యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తొలుత వీటిని మే నెలాఖరుకు పూర్తి చేయాలనుకన్నా కొన్ని కారణాల వల్ల మరో ఆరు నెలలు (నవంబరు వరకు) పొడిగించినట్టు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ స్వామినాయుడు తెలిపారు. ఈ యూనిట్లకు సంబంధించి సివిల్ మేజర్ పనులు పూర్తయ్యాయని, మిగిలినవి కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆ రెండు యూనిట్లకు నీటిని సరఫరా చేసే మూడో పెన్‌స్టాక్ పైపులైన్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులు సైతం శరవేగంగా సాగుతున్నాయి. సీఈ స్వామినాయడు, ఇతర ఉన్నతాధికారులు వీటిని పరిశీలిస్తున్నారు. కాంట్రాక్టర్లు నవంబరు నెలాఖరుకు పనులు పూర్తి చేసి జెన్‌కోకు అప్పగిస్తే పొల్లూరు జల విద్యుత్ కేంద్రం 690 మెగావాట్లతో అధిక ఉత్పత్తి కేంద్రంగా నిలుస్తుందని సీఈ వివరించారు.



లక్ష్యాలు స్వల్పంగా పెంపు

రాష్ట్రంలో జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి సంబంధించి కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) లక్ష్యాలు నిర్దేశిస్తోందని సీఈ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌కు 2286 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా విధించారు. మార్చి నెలాఖరుకు నాలుగు జల విద్యుత్ కేంద్రాలు (పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్) ద్వారా 2,454 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి జరిగింది. లక్ష్యం కంటే 168 మిలియన్ యూనిట్లు అదనంగా ఉత్పత్తి చేశామన్నారు. దీంతో కేంద్ర విద్యుత్ అథారిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సీలేరు కాంప్లెక్స్‌లోని నాలుగు కేంద్రాల లక్ష్యాలను గతేడాది కంటే 28 మిలియన్ యూనిట్లు పెంచింది. ఈ ఏడాది సీలేరు కాంపెక్స్ లక్ష్యం 2314 మిలియన్ యూనిట్లు సాధించేలా కృషి చేస్తామని సీఈ వివరించారు.



ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న నన్నయ విశ్వవిద్యాలయం, టీఐకేఎం అధికారులు

శ్రీలంక సంస్థతో సంయుక్త పరిశోధనకు

'నన్నయ' అవగాహన ఒప్పందం

దివాన్‌చెరువు, మే 14 (ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ సంస్థతో చేసుకున్న ఎంవోయూ ద్వారా సంయుక్త పరిశోధనకు, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ వంటి పలు అంశాల్లో పరస్పర సహకారం లభిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. శ్రీలంకకు చెందిన ది ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్మెంట్ (టీఐ ఐకేఎం)తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం విశ్వవిద్యాలయం ఈసీ హాల్లో జరిగిన సమావేశానికి వీసీ ప్రసన్నశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, టీఐఐకేఎం సహ వ్యవస్థాపకుడు ఇసాంక పి గమగే ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి వీసీ సమక్షంలో మార్చుకున్నారు. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంతర్జాతీయ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీని ద్వారా జాయింట్ కాన్ఫరెన్స్‌లు, వెబినార్లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, డిగ్రీ కార్యక్రమాలు, కమ్యూనిటీ సర్వీసెస్, పబ్లికేషన్ సపోర్ట్ సర్వీసెస్ వంటి వాటికి పరస్పరం సహకారం లభిస్తుంద న్నారు. భవిష్యత్తులో అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వి.పెర్సిస్, శ్రీలంక శ్రీజయవర్ధనేపుర విశ్వవిద్యాలయం పాలీ, బౌద్ధ అధ్యయనాల విభాగా నికి చెందిన మొరవాక ధమ్మురఖిత థెరో, ప్రొఫెసర్ నిమాలి తక్షితలా వితనాగే తదితరులు పాల్గొన్నారు.



అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్ల క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు

'ఉమ్మడి' జిల్లా జట్ల పయనం

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాల, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లు బుధవారం పిఠాపురం నుంచి పయనమయ్యాయి. వీరికి గత నాలుగు రోజులుగా పిఠాపురంలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో శిక్షణ ఇచ్చారు. క్రీడాకారులకు పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగిలి కాశీవిశ్వనాథం, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకులు కొత్తపల్లి బుజ్జి, బొజ్జా కుమార్, పల్నాటి మధు, జాన్, బాబీ క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తదితరులు పాల్గొన్నారు.



మేమూ అవుతాం బీచ్‌లో చిల్

ప్రస్తుతం ఎండలకు మనుషులే విలవిల్లాడుతున్నారు. అలాంటిది మూగజీవాలు పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పాలిన పనే లేదు. ఎప్పుడూ సందర్శకులతో ఉండే కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో బుధవారం ఇదిలో ఇలా గేదెల గుంపు అతిథుల్లాగా వచ్చి కాసింతసేపు సేదతీరింది.

ఫొటోగ్రాఫర్- కాకినాడ



నేనున్నానని..నీకేం కాదని...

ఎన్నో ఏళ్లు వయసు ఉన్న వృక్షం మరణిస్తే అందులో నుంచి నేను ఉన్నానంటూ నిర్జీవ వృక్షాన్ని ఆసరా చేసుకుని కొత్త వృక్షం పునరుజ్జీవంతో పర్యావరణ హితానికి అడుగులు వేస్తోంది. రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్‌లో మూడోవ రైలు బ్రిడ్జికి సమీపంలో పూర్తిగా ఎండిపోయిన నిద్రగన్నేరు చెట్టును అనుకుని మరిచెట్టు మహావృక్షంగా మారేందుకు పాత వృక్షాన్ని ఆసరగా చేసుకుని పచ్చదనాన్ని అందిస్తోంది

ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం

యువత... జాగ్రత్త!



- వేసవిలో జలకాలాటలకు దిగుతున్న యువకులు, విద్యార్థులు
- గల్లంతవుతున్న ఘటనలు
- కాలువ గట్లకు తూట్లతో ప్రమాదాలు

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు యువత కాలువ గట్ల వద్ద వాలిపోతుంటారు. సరదగా స్నానాలు చేద్దామని స్నేహితులతో కలిసి వెళ్తుంటారు. అది వినోదమే కానీ దాని వెనుక ప్రమాదం దాగి ఉందనే సంగతి మరిచిపోతున్నారు. ఫలితంగా గల్లంతుకావడం, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరుగుతున్నాయి. ముఖ్యంగా కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాద భరితంగా మారింది. ఈ కాలువకు నియోజకవర్గంలోని పెదశంకర్లపూడి, రౌతుపాలెం, పెద్దిపాలెం, పొదురుపాక, గజ్జెనపూడి, చింతలూరు, యుజేపురం, జి.కొత్తపల్లి తదితర గ్రామాల వద్ద రెండు వైపుల ఉన్న గట్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వర్షాలు కురిసిన సమయంలో ఈ గట్లు కోతకు గురికావడం వల్ల కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో ఉన్న యువకులు, విద్యార్థులు కోతకు గురైన గట్ల వద్ద కాలువలోకి దిగి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. రెండు రోజుల క్రితం పెదశంకర్లపూడిలోని ఏలేరు కాలువలో నలుగురు విద్యార్థులు స్నానానికి దిగిన సంఘటనలో ఒక విద్యార్థి మరణించాడు. కాలువ గట్ల పటిష్టతకు ఏలేరు ఎడమ కాలువ అధికారులు చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ విద్యార్థులు, యువకులు వేసవిలో కాలువలో జలకలాడేందుకు ఆసక్తి చూపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువ గట్ల వద్ద పహరా ఉంచడంతో పాటు యువత జాగ్రత్తగా ఉంటే కొంతవరకు ప్రమాదాలు నివారణ సాధ్యపడేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పెదశంకర్లపూడిలో ప్రమాదకరంగా మారిన ఏలేరు ఎడమ కాలువ గట్టు

పదో తరగతిలో అడుగుపెట్టకుండానే ప్రాణాలు వదిలి..

ఏలేరు కాలువలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



విఘ్నేష్ మృతదేహం

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని ఏలేరు కాలువలో గల్లంతైన 9వ తరగతి విద్యార్థి విఘ్నేష్ (14)మృతదేహం బుధవారం లభ్యమైంది. పెదశంకర్లపూడికి చెందిన నలుగురు విద్యార్థులు సరదగా ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి ప్రమాదానికి గురైన ఘటనలో పంది వీర వెంకట సత్యనారాయణ విఘ్నేష్ గల్లంతై మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడిన విషయం తెలిసిందే. గల్లంతైన విద్యార్థి విఘ్నేష్ కోసం బుధవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. కాలువ అడుగుభాగంలో చిక్కుకుపోయిన విఘ్నేష్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు విఘ్నేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. లంపకలోవ జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరంలో పదో తరగతి చదవాల్సిన తమ కుమారుడు ఏలేరు కాలువ పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికందివచ్చే బిడ్డ ఏలేరు కాలువకు బలి కావడం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



మృతదేహాన్ని కాలువలో వెలికితీస్తున్న దృశ్యం

రైల్వే స్టేషన్‌లో...
బ్యాటరీ కారు ఢీకొని లోకో పైలట్‌కి గాయాలు



ఆస్పత్రిలో రామారావు

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్ ఢీకొని లోకో పైలట్ గాయాల పాలయ్యాడు. ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో లోకోపైలట్‌గా పనిచేస్తున్న రాజమండ్రి లలితానగర్‌కి చెందిన రామారావు విధుల ముగించుకుని రెండో ప్లాట్‌ఫాం నుంచి ద్విచక్రవాహనం తీసుకుందామని వస్తున్నాడు. ఈలోపు మూడో ప్లాట్‌ఫాం నుంచి వస్తున్న బ్యాటరీ కారు ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు ఎముకకు గాయమైంది. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని ఎస్ఐ లోవరాజు తెలిపారు. అయితే ఇక్కడ ప్లాట్‌ఫాంలు రద్దీ సమయంలో ఇరుగ్గా ఉండడంతో ఇబ్బంది ఏర్పడుతోంది. 2,3,4 ప్లాట్‌ఫాంల నుంచి మెయిన్ గేటు వైపునకు ప్రయాణికులను తీసుకురావాలంటే కచ్చితం గా ఆ ప్లాట్‌ఫాంల చివరన రైలు ట్రాకులు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రైలు వెళ్లే సమయంలో బ్యాటరీ కారుకు పొరబాటున బ్రేకులు పడకపోతే ప్రమాదం ఊహించని విధంగా ఉంటుందని ప్రయాణికులు వాపో తున్నారు. విజయవాడ మాదిరిగా ఇక్కడ ప్రస్తుతం బ్యాటరీ కారు నడపడానికి భద్రతాపరంగా అనుకూలం కాదని.. ఓ వైపు కుక్కలు, మరో వైపు బ్యాటరీ కారుతో రద్దీ సమయంలో గందరగోళానికి గురవుతున్నామని చెప్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాకినాడ జిల్లా తుని పట్టణం బాలయోగి మెట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతిచెందిన వ్యక్తి శరీరం గుర్తుపట్టలేనంతగా మారడంతో వివరాలు కానరాలేదన్నారు. శవాన్ని ఏరియా ఆసుపత్రిలో మృతదేహం భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

మహిళపై హత్యాయత్నం

16 గంటలు అచేతనస్థితిలో

తుప్పల్లో ఉండిపోయిన వైనం

అమలాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలోని సడక్ రోడ్డులో ఓ మహిళ తుప్పల్లో పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను 108లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లవరం మండలం మొల్లేటిమెరకకు చెందిన మంగాదేవి(30) స్థానిక సడక్ రోడ్డులో గల తుప్పల్లో పడి ఉండడాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 16గంటల పాటు తుప్పల్లో ఆమె అచేతన స్థితిలో ఉంది. పోలీసులు ఆమెను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోసంగివారిపేటకు చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి తనను తీసుకెళ్లి దాడి చేసి హత్యాయత్నం చేసినట్టు ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన మహిళ పోలీసులకు తెలిపింది. అల్లవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె జీజీహెచ్‌లో చికిత్స పొందుతుంది.

జేసీబీ, లారీ సీజ్

రౌతులపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మూలగపూడి సర్వేనెంబర్1లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు చేసి జేసీబీ, లారీ సీజ్ చేసినట్టు టెక్నికల్ అసిస్టెంట్ తేజ తెలిపారు. సర్వే నిమిత్తం రాగా అక్రమ గ్రావెల్‌ను గుర్తించామన్నారు. క్రషర్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న కే.అరుణ్‌కుమార్‌కు చెందిన వాహనాలను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామని ఆయన చెప్పారు.

అన్నవరం దేవస్థానం
మాస్టర్‌ప్లాన్‌ను పునఃపరిశీలన చేయాలి

- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు
- ప్రసాద్ స్కీం పనులకు మరోసారి టెండర్లు
- విష్ణుసదన్ సత్రం వద్ద నూతనంగా నిర్మించదలిచిన ప్రదేశానికి స్థల పరిశీలన

అన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఏటేటా పెరుగుతన్న భక్తుల తాకిడికి అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పాత మాస్టర్‌ప్లాన్‌ను రివైజ్డ్ చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. బుధవారం అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో విజయవాడ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న మాస్టర్‌ప్లాన్ 2019లో అప్రూవల్ కాగా దానికి విరుద్ధంగా పలు నిర్మాణాలను చేపట్టాల్సి వచ్చింది. దీంతో రివైజ్డ్ చేయాలని ఏమేమి నిర్మించాలి, ఎక్కడ నిర్మించాలి అనే అంశాలపై నూతన మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. సీతారామసత్రం కూల్చివేత, విష్ణసదన్ ఎదురు గా నూతనంగా నిర్మించతలపెట్టిన 128 గదుల సత్రాన్ని దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ స్థల పరిశీలన చేయాలని సూచించారు. ప్రసాద్ స్కీం పనులకు మరోసారి టెండర్లు పిలవడం జరుగుతుందని సూత్రప్రాయంగా తెలిపారు. దేవదాయ కమిషనర్ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ఆయన పలు సూచనలు చేశారు. సమావేశానికి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, నూకరత్నం, డీఈలు రాంబాబు,ఉదయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

'ఏలేరు'లో భారీగా తగ్గిన నీటి నిల్వలు

ఏలేశ్వరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు భారీగా తగ్గుతున్నాయి. ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజక వర్గాల పరిధిలో సుమారు 60వేల ఎకరాలు వ్యవసాయ భూములున్నాయి. సాగుకు పూర్తిగా సరఫరా నిలిపి వేసి విశాఖ మహానగరం అవసరాలకు జలాలను సరఫరా చేస్తున్నారు. దీంతో ఏలేరులోని దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా శనివారం 76.51 మీటర్లుగా నమోదైంది. పూర్తిస్థాయి నిల్వల సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.71 టీఎంసీల మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి.

అడుగంటిన తిమ్మరాజు చెరువు

ప్రస్తుతం విశాఖకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఏలేశ్వరం గ్రామీణ మండలాల్లో ఏలేరు జలాలనే శుద్ధి చేసి తాగునీటిగా అందిస్తున్నారు. పశువుల తాగునీటి అవసరాలకు కాలువలకు అ ప్పుడప్పుడు నీటిని విడుదల చేస్తారు. ఎండలు మరింత అధికమైతే నీరు ఆవిరి అయిపోవడంతో నిల్వలపై ప్రభావం చూపుతోంది.



ఏలేరు జలాశయంలో తగ్గిన నీటి మట్టం

ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన

ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు సాగు నీరందించే తిమ్మరాజు చెరువు అడుగంటడంతో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలేరు జలాశయం నుంచి సుమారు 50 నుంచి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. దీనిలో అర టీఎంసీ నీరు నిల్వ ఉంటుంది. చెరవు నుంచి వచ్చే నీటి ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందిచవచ్చు. కానీ పొలాలకు నీరందించే కాలువలో పూడిక, తుప్పలు తొలగించకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లోను, ఇళ్ల మధ్యలోను ఎక్కడిక్కడ నీరు ఉండిపోవడంతో చెరువులోని నీరు పొలాలకు చేరకుండా మధ్యలో ఆగిపోతుంది. ఖరీఫ్ సాగు ముందు కాలువలను శుభ్రం చేసి పొలాలకు నీరందేలా తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అడుగంటిన తిమ్మరాజు చెరువు దృశ్యం

రెండు లారీలు ఎదురెదురుగా ఢీ

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. బుధవారం ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ ఆలయ సమీపంలో గోదావరి గట్టుపై కొవ్వూరు వైపు నుంచి తాళ్ళపూడి వెళ్తున్న ఇసుకలోడ్ టిప్పర్ లారీ, తాళ్లపూడి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌కి స్వల్పగాయాలు కాగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో కొవ్వూరు తాళ్ళపూడి గోదావరి ఏటిగట్టు రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆరికిరేవుల జాతర బందోబస్తు నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను ఆరికిరేవుల గ్రామంలోంచి బయటకు మళ్లించారు. పోలీసు, ఫైర్ అధికారులు, జేసీబీ సహాయంతో లారీ క్యాబిన్‌లో ఇర్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.





డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం, సంఘటనా స్థలంలో లారీలు

ఏపీ పాలిసెట్‌లో 'తిరుమల' విద్యార్థుల ప్రతిభ

అభినందనలు తెలిపిన చైర్మన్

రాజమహేంద్రవరంరూరల్ మే 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గల తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మార్కులకుగాను 120 మార్కులు ఆరుగురు విద్యార్థులు బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నా, పాల రోహన్ సాధించారు. 119 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతో పాటు 50 లోపు 14మంది, 100లోపు 23 మంది, 500 లోపు 79మంది విద్యార్థులు సాధించారన్నారు. ర్యాంకుల సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్స్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

కనుల పండువగా భావనారాయణస్వామి తెప్పోత్సవం

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఎనిమిది రోజులుగా శోభాయమానంగా జరుగుతున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆలయం ఎదురుగా గల ముక్తికా సరస్సులో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్ప (హంస వాహనం)పై స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో విహరిస్తుండగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి పులకించారు. తొలిసారిగా తెప్పోత్సవం నిర్వహించిన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఈవో లక్ష్మీనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





సర్పవరంలో హంస వాహనంపై భావనారాయణస్వామి తెప్పోత్సవం, తిలకిస్తున్న భక్తులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించేది లేదు : డిప్యూటీ ఎంపీడీవో

బిక్కవోలు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని బిక్కవోలు డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్ హెచ్చరించారు. బలభద్రపురంలోని రామరాజు చెరువు గట్టును ఆదిరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి కొన్ని షాపులు, వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశాడు. దీనిపై ఆక్రమణలను తొలగించాలంటూ పీజీఆర్ఎస్‌లో మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్ పంచాయతీ సిబ్బందితో పరిశీలించగా ప్రభుత్వ భూములని తేలడంతో ఆక్రమణలను తొలగించాలంటూ అతనికి నోటీసులు జారీ చేశారు. దీంతో అత ను


బలభద్రపురంలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

పట్టించుకోకపోవడంతో బుధవారం డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డితో వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో షాపులను, సర్వీసింగ్ సెంటర్‌ను నేలమట్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ కమిషన్ సభ్యురాలు పర్యటన

తాళ్లపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీ య మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి బుధవారం ప్రక్కిలంకలో పర్యటించారు. గ్రామంలో నిర్మిస్తున్న సూర్య దేవాలయ నిర్మాణ స్థలానికి సంబంధించి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె ఎండీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతూ గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా ఆలయానికి వేరే స్థలాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

మురళీనాయక్ త్యాగం ఎంతో గొప్పది

● నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 14 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ముష్కరుల దాడిలో అశువులు బాసిన అమరవీరుడు మురళీనాయక్ త్యాగం ఎంతో గొప్పదని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. విశ్వవిద్యాయలం కేంద్ర పరిపాలనా భవనం ఎదురుగా మురళీనాయక్ భారీ ఫ్లెక్సీని ఏర్పాటుచేసి బుధవారం ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వీర జవాన్ మురళీ నాయక్ మన అందరిహృదయాలలో గూడు కట్టుకుని ఉన్నాడన్నారు. దేశ రక్షణ కోసం తన ప్రాణాన్నే త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు ఆయన అని కొనియాడారు. ప్రతీవ్యక్తి దేశం తనకేమి ఇచ్చిందని కాకుండా దేశానికి తానేమిచేశాననే ధోరణిలో ఉండాలని అన్నారు.



మురళీనాయక్ ఫ్లెక్సీ వద్ద వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

మన పనిని మనం త్రికరణశుద్ధిగా నిర్వహించడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుంద, అదే దేశభక్తి అన్నారు. అమరవీరుల త్యాగాలను వృథా చేయకుండా యువత దేశభక్తితో దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అనంతరం మురళీనాయక్ ఆత్మశాంతికి రెండునిమిషాలు మౌనం పాటించారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్ప యాగం


శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పార్కువీధిలో వున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారంరాత్రి స్వామి, అమ్మవార్లకు ఘనంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పూలు, పండ్లు, స్వీట్లు స్వామికి కానుకగా అందజేశారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు వ్యవసాయ పరికరాల పంపిణీ

రాజానగరం, మే(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం నుంచి విడుదలైన వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నేడు కోరుకొండలో ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రైతన్నల కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం రూపొందించిందన్నారు. 2025 ప్రోత్సాహక వ్యవసాయ యంత్రాలు, పరికరాలు పంపిణీ కార్యక్రమం రైతన్నకు అండగాఉంటూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, వ్యవసాయంలో సరికొత్త విధానాలతో ముందుకు వెళు తుందన్నారు. ఈనెల 15న మధ్యాహ్నం 3గంటలకు కోరుకొండ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో యంత్ర పరికరాలను పంపిణీ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి సంయుక్తంగా రైతులకు యంత్రపరికరాలు పంపిణీ చేస్తామన్నారు. రైతులంతా విధిగా హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.


మురుగునీరు పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

మురుగునీటి మళ్లింపు పైపులైను పనులు
త్వరలో పూర్తి చేస్తాం

● పనుల పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో మురుగునీటిని మళ్లించేందుకు ఎంతో కీలకమైన ఎస్ఆర్‌సీపీ పంపింగ్ స్టేషన్ పైపులైను పనులు త్వరలో పూర్తవుతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నగరంలో ముగ్గుపేట వద్ద జరుగుతున్న పనులను ఆదిరెడ్డి వాసు పరిశీలించారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ లింగంపేట ఎస్ఆర్ సీపీ పంపింగ్ స్టేషన్ నగరంలోని మురుగునీటిని గోదావరిలో కలువకుండా మళ్లించేందుకు ఎంతో కీలకం అన్నారు. 450 హెచ్‌పీ సామర్థ్యంతో నెలకొల్పిన ఈ పంపింగ్ స్టేషన్ వద్ద నుంచి పైప్‌లైన్‌ల ద్వారా స్వతంత్ర ఆసుపత్రి, దేవీచౌక్, అజాద్ చౌక్, ముగ్గుపేట, శీలం నూకరాజు లేఅవుట్, కిమ్స్ ఆసుపత్రి, పెట్రోల్ బంక్, షెల్టాన్ హోటల్ మీదుగా 3.5 కి.మీ ప్రవహించి ఆవలో కలుస్తుందన్నారు. పదిహేనేళ్ల క్రితం వేసిన ఆర్‌సీసీ పైప్‌లైన్ తుప్పు పట్టి కాలక్రమేణా దెబ్బతిని నీరు లీకవ్వడంతో ఏడాది క్రితం వైసీపీ పాలనలో ముగ్గుపేట వద్ద భూమి కుంగిపోయి లారీ దిగబడి పోయిందని చెప్పారు. ఆనాడు తాము ప్రతిపక్షంలో ఉన్నామని రోడ్డు గుల్లవుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. శీలం నూకరాజు లేవుట్, పెట్రోల్ బంక్ వద్ద కూడా రోడ్డు కుంగిపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పైప్‌లైన్ పనులకోసం ఫేజ్-1లో కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.97లక్షలతో 440 మీటర్ల పనుల కోసం శీలం నూకరాజు రోడ్డువద్ద తాను మొదటి కొబ్బరికా య కొట్టానని ఎమ్మెల్యే గుర్తుచేశారు. దెబ్బతిన్న ఆర్‌సీసీపైప్‌లైన్ స్థానంలో నాణ్యత కలిగిన డీఐ పైప్‌లైన్ వేయిస్తున్నామన్నారు. శీలం నూకరాజు రోడ్డువద్ద పనులు పూర్తిచేశామని అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నుంచి కోటి 20లక్షల నిధులతో ముగ్గుపేటవద్ద పైప్‌లైన్ పనులు మొదలయ్యాయని చెప్పారు. పైప్‌లైన్ పనులు వేగం పెంచి పూర్తి నాణ్యతతో 1.2 కిలోమీటర్లు పూర్తి చేయగలిగామని మిగతా 2 కి.మిపైగా ఉన్న పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పా ల్గొన్నారు.

రాజమహేంద్రవరం నగరాభివృద్ధిలో
ఆస్తి పన్నుల వసూళ్లు కీలకం

● డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ

రాజమహేంద్రవరం సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అభివృద్ధిలో ఆస్తి పన్నుల వసూళ్లు అత్యంత కీలకమని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు, పరిపాలన కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను విధించాల్సిన ఇళ్లతోపాటు పన్ను పెంచాల్సిన ఇళ్లను గుర్తించడానికి సర్వే నిర్వహించాలన్నారు. బేస్‌రిజిష్టర్ ఆధారంగా డిమాండ్ నోటీసులు ఇచ్చేటప్పుడు ఇళ్లకు పన్ను పెంచవలసిన అవసరం ఉన్నదీ, లేనిదీ గుర్తించాలన్నారు. అదేవిధంగా ఖాళీస్థలాలు గుర్తించి పన్ను విధించాలన్నారు. ఇన్‌చార్జి అడ్మిన్ సెక్రటరీలు ఉన్నచోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. షాపు, రూముల అద్దెలు ప్రతినెలా 10వ తేదీలోగా వసూల్ చేయాలని, అలాగే వాటిని రిజిష్టర్ చేయాలని ఆదేశించారు. షాపుల లీజుల పునరుద్ధరణకు అవసర మైనచర్యలు తీసుకోవడంతోపాటు లీజులు పునరుద్ధరించాల్సిన షాపులు అద్దె బకాయిలు లేకుండా వసూల్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న షాపులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సీజ్ చేసిన షాపులకు వెంటనే వేలం నిర్వహించాలని సం బంధిత గుమస్తాను ఆదేశించారు. రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, అడ్మిన్ సెక్రటరీలు, రెవె న్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్

మహిళల సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలి

● డీఎస్పీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల సెల్‌ఫోన్లలో శక్తి యాప్ కచ్చితంగా ఉంటే ఆపద సమయంలో పోలీసుల సహాయం నిమిషాల్లో అందుతుందని.. ప్రతిఒక్కరూ శక్తియాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తి టీం జిల్లా నోడల్ అధికారి, మహిళా పీఎస్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాలలో మహిళలపై జరుగుతున్న నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న లైగింగ దాడుల గురించి వివరించారు. స్వీయ రక్షణ మెళకువలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, యాప్‌లను బాధ్యతాయుతంగా వినియోగించకపోతే జరిగే తీవ్ర నష్టాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరంసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఉల్లితోట వీధికి చెందిన ఎస్.ఆంజనేయ కుమార్ అనే 42 ఏళ్ల వ్యక్తి కనిపించడం లేదని టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకివెళితే.. ఉల్లితోట వీధికి చెందిన అంజనేయకుమార్‌కు భార్య రామలక్ష్మి, పిల్లలు ఉన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆంజనేయకుమార్ తిరిగి ఇంటికి రాలేదు. గతంలో కూడా ఇదే మాదిరి వెళ్లి తిరిగి వచ్చాడు. దీంతో ఎదురు చూసిన భార్య పిల్లలు ఎంతకీ భర్త తిరిగిరాకపోవడంతో బంధువులతో వాకబుచేశారు. ఆచూకీ తెలియకపోవడంతో భార్య రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జవహర్‌కు ఘన స్వాగతం

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి కేఎస్ జవహర్‌కు గురువారం పంగిడిలో ఘన స్వాగతం పలకనున్నట్టు టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి బూరుగుపల్లి రాఘవులు తెలిపారు. ఆ సాయంత్రం నాలుగు గంటలకు పంగిడి నుంచి కాపవరం, దొమ్మేరు మీదుగా పట్టణంలోని విజయవిహార్ సెంటర్ మీదుగా ర్యాలీగా ఆయన నివాసానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పంచాయతీలలో
మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

● రూరల్ గ్రామాల పరిశీలనతో ప్రత్యేక అధికారి కేతన్ గార్గ్


హుకుంపేటలో డ్రైనేజీలు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కేతన్ గార్గ్

రాజమహేంద్రవరంరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని రూరల్ గ్రామాల స్పెషల్ ఆఫీసర్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బుధవారం రూరల్ మండలంలోని హుకుంపేట, శాటిలైట్ సిటీ గ్రామాలలో కమిషనర్ కేతన్‌గార్గ్ పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా, డ్రైనేజీ సిస్టం ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాల్సిందిగా సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు వంద శాతం కనెక్షన్లు నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. సచివాలయాల పరిధిలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు ఓ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. చివరి కాలనీ వరకు పర్యటించి ఏఏ ప్రాంతాలలో డ్రైయిన్లు, రోడ్లు నిర్మించాలో సమగ్ర నివేదిక సిద్ధం చేసి తనకు అందజేయాలని, అదేవిధంగా రోడ్డుపైకి ఇరువైపులా ఎక్కడా చెత్తకుప్పలుగా ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలు, తాగునీరు పారిశుధ్య సమస్యలను గుర్తించామని వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

ఐఎల్‌టీడీ-ధవళేశ్వరం మెయిన్‌రోడ్డుపై
ఇసుక తొలగించాలి : డీవైఎఫ్ఐ

రాజమహేంద్రవరంఅర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం వెళ్లే మెయిన్‌రోడ్డుపైనా, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇసుకను అధికార యంత్రాంగం వెంటనే తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం జిల్లా కన్వీనర్ వి.రాంబాబు ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రధాన రహదారిలోని ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి సాయిబాబాగుడి వరకూ రోడ్డుకు ఇరువైపులా ఇసుక ఉన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గాయత్రి ఘాట్ పరిసర ప్రాంతాల్లోని ఇసుక ర్యాంపుల నుంచి ప్రతిరోజూ వందల లారీలు ఇసుకను తరలిస్తున్నాయని, లారీకి మించి లోడింగ్ చేయడంవల్ల ఇసుక రోడ్డుపైపడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న ఇసుకను వెంటనే తొలగించాలని, లేకుంటే ధర్నా చేపడతామని పేర్కొన్నారు.

'రైస్‌మిల్లర్లు మార్గదర్శకాలు అనుసరించాలి'

నిడదవోలు, మే 14 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి నేరుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుసరించి ఉండాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి రాణీసుస్మిత అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్‌తో ధాన్యం కొను గోలుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాకు నిర్దేశించిన 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని నిర్దేశిస్తామన్నారు. ఆయా మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నా రు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీ సుస్మిత

రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో విధిగా బి.రిజిస్టరులో సంబంధిత లావాదేవీల వివరాలు నమోదు చేయాలన్నారు. ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్, తహశీల్దార్ బి.నాగరాజు నాయక్, మిల్లర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఎస్.రమేష్, మిల్లర్లు పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో భారతీయ విద్యాభవన్స్‌కు ఉత్తమ ఫలితాలు

దివాన్‌చెరువు, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 10, 12 తరగతుల ఫలితాలలో భారతీయవిద్యాభవన్స్ విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ సూర్యన్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన విజయోత్సవసభలో ఆయన మాట్లాడుతూ 10, 12 తరగతులలో విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో భవన్స్ భీమవరం కేంద్ర కార్యదర్శి సామంతపూడి రామరాజు, కాకినాడ కేంద్రం వైస్‌చైర్మన్ సి.ఎం.కుమార్ నాయర్, డైరెక్టర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి, అకడమిక్ డైరెక్టర్ రఘుపతిరాజు, భవన్స్ విద్యాధికారి జె.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

రాజమహేంద్రి విజయభేరి

దివాన్‌చెరువు, మే14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 10 వ తరగతి ఫలితాలలో రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులతో తమ ప్రతిభను కనబరచారని ఆ విద్యాసంస్థల చైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి పరీక్షలకు 46 మంది విద్యార్థులు హాజరుకాగా నూరుశాతం ప్రథమశ్రేణి లో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. తేతల కృష్ణతేజ శ్రీరెడ్డి 500 మార్కులకుగాను 485 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టి.వి.డి.చంద్రశేఖర్, డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, సత్యసౌందర్య విద్యార్థులను అభినందించారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి స్టేట్ ఫస్ట్

రాజమహేంద్రవరం సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి):సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో దివాన్ చెరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి రాధికాశర్మ 500 మార్కులకుగాను 495 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ స్థానంలో నిలిచిందని స్కూల్ చైర్మన్ జె.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. తమ విద్యా ర్థి అద్భుత విజయాన్ని సాధించారని అభినందించారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో శ్రీగౌతమి విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరంసిటీ, మే14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలు-2025లో రాజమహేంద్రవరం శ్రీగౌతమి విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా శ్రీగౌతమి డైరెక్టర్ సుంకర రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థిని జి.అంజనాప్రియ స్టేట్ 32వ ర్యాంక్ సాధించిందన్నారు. అదేవిధంగా కె.రవిత 127వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ఐదువందలోపు ఐదుగురు, వెయ్యిలోపు పదిమంది ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. వారిని అభినందించారు. ఈ విజయంలో భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు రవికుమార్ అభినందనలు తెలిపారు.

17న ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరంరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంరూరల్ మండలానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 17న మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తెలిపారు. 17న ఉదయం 10:30గంటలకు వెంకటనగరం, తొర్రేడు, కోలమూరు కాతేరు, పిడింగొయ్యి, రాజవోలు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంట ర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2:30 నుంచి బొమ్మూరు, ధవళేశ్వరం, హుక్కుంపేట, శాటిలైట్‌సిటీ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. దరఖాస్తుదారులంతా సకాలంలో ఇంటర్వ్యూలకు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్‌తో దేశం సత్తా చాటారు

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌తో దేశ సైనిక శక్తి పరాక్రమాన్ని ప్రపంచానికి చూపిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరులో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం తగిన సమాధానం చెప్పిందన్నారు.

డీవీఎంసీ కమిటీ సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) :షెడ్యూల్డు కులాలు, తెగల ప్రజలపై జరుగుతున్న అత్యాచార కేసుల పరిశీలన నివారణ చర్యలపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుల ఎంపికకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన ఐదుగురు అనధికార సభ్యులను, ఎన్జీవోలతో అనుబంధంగా పనిచేస్తున్న ఇతర కులాలకు చెందిన ముగ్గురు సభ్యులను ఎంపిక చేయడానికి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి ఎంఎస్ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఇతర ధ్రువపత్రాలతో ఈనెల 16వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'విగ్రహాలపై రాజకీయాలు వద్దు'

రాజమహేంద్రవరం సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో విగ్రహాలపై రాజకీయాలు చేయడం టీడీపీ నాయకులు మానుకోవాలని వైసీపీ బీసీ నాయకుడు మజ్జి అప్పారావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన, సప్పా ఆదినారాయణ, దుర్గారావులతో కలిసి మాట్లాడారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ గతంలో గోదావరి బండ్‌పై రేలంగి విగ్రహం ఏర్పాటును అడ్డుకున్నట్లుగా కావాలనే టీడీపీ వారు బురద జల్లుతున్నారని అన్నారు. పైగా ఇప్పుడు గోదావరి బండ్‌పై విగ్రహాలను తొలగించి మళ్లీ పెడతామని వారే చెప్పారని ఇది కరెక్ట్ కాదన్నారు. గోదావరి బండ్‌పై మహనీయుల విగ్రహాలకు, పిండాల రేవుకు ఇబ్బంది కలుగకుండా గతంలో తమ నాయకుడు భరత్ వ్యవహరించారని కాని ఇప్పుడు మీరు ఉన్న విగ్రహాలను మార్పుచేస్తున్నామని చెప్పడంతోపాటు పిండాల రేవును తొలగిస్తున్నారని ఇది సరియైన విధానం కాదన్నారు.

20న జరిగే సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలి


● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ


సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

రాజమహేంద్రవరంఅర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా మే 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు కార్మికులంతా సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. దేశంలో హిందూ మతోన్మాద పాలన రాజ్యమేలుతున్నదని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ పహల్గాం దాడి ఘటన విషయంలో దేశం యావత్తూ ప్రధాని మోదీకి అండగా నిలిస్తే చివరకు ఆయన సాధించిందేమిటని ప్రశ్నించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాకిస్తాన్ అంశంలో ఐరన్‌లేడీగా వ్యవహరించారని, కానీ మోదీ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉందన్నారు. ఇండియా, పాకిస్తాన్ ఘర్షణల విషయంలో అమెరికా మధ్యవర్తిత్వం ఏమిటని ప్రశ్నించారు. మతం ఆధారంగా చేసుకుని ప్రభుత్వాలు పాలన చేయలేవని, రాజ్యాంగం నిలబడదని అన్నారు. హిందూ మతం ప్రమాదం లేదని, అయితే ఇస్లామిక్ ఉగ్రవాదం పేరుతో దేశ ప్రజలను మబ్బుల్లో ఉంచుతున్నారని విమర్శించారు. జిల్లాలో ఆగస్టు 6, 7, 8 తేదీల్లో జరుగనున్న సీపీఐ జిల్లా మహాసభలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నాయకులు కె.రాంబాబు, వి.కొండలరావు, సప్ప రమణ, కె.జ్యోతిరాజు, పి.లావణ్య, తోట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్వారీ అండ్ క్రషర్ అసోసియేషన్ ఎన్నిక

దేవరపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): క్వారీ క్రషర్ యాజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూత నంగా ఎన్నికైన క్వారీ అండ్ క్రషర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రూ అనిల్ పేర్కొన్నారు. దేవరపల్లి కాకర్ల ఫంక్షన్‌హాలులో ది వెస్ట్ గోదావరిక్వారీ అండ్ క్రషర్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ బుధవారం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ఏకగ్రీవ మైంది. గౌరవ అధ్యక్షుడిగా పొట్లు సోమేశ్వరరావు, అధ్యక్షుడిగా ఆంధ్రూ అనిల్, ఉపాధ్యక్షులుగా ముదునూరి సూర్యనారాయణరాజు, పేపకాయల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దొనెల్లి మధుబాబు, కోశాధికారిగా కోట్ల కనకేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడుసంవత్సరాల పాటు ఉంటుందన్నారు. అనంతరం నూత నంగా ఎంపికైన కమిటీని క్వారీ అండ్ క్రషర్ యాజమానులు అభినందనలు తెలిపారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0 (బుధవారం)
కనిష్ఠం : 27.0

రైతన్నలకు అండగా ఉంటాం!

» ప్రతి ధాన్యం గింజా కొంటాం » మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 14(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతన్నకు విత్తనం నుంచి విక్రయం వరకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దగాపడిన రైతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొంటుందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో మరో 8025 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నామని వెల్లడించారు. నిడదవోలు మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, పెరవలి మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, ఉండ్రాజవరం మండలంలో 6,025 మెట్రిక్ టన్నులు అదనపు ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎవరు అధైర్య పడవద్దని, గతంలో పడిన పాట్లు ఏ ఒక్క రైతు పడకూ డదనే ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం అమలుకానుందని తెలిపారు.

జిల్లాలో 3.17 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

రాజమహేంద్రవరం, మే14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం 2332.840 టన్నుల ధాన్యాన్ని సేకరించామని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. దీంతో ఇప్పటివరకూ 27,397 మంది రైతుల నుంచి 3,17,462.8 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి రూ.730.85 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకూ రూ.603.67కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఆదేశాలతో ఈసారి అధిక మొత్తంలో ధాన్యాన్ని సేకరిస్తున్నామని, అందువల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టంచేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 527 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలకు జిల్లాలో 527 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. మొదటి ఏడాది 9811, రెండో ఏడాది 978, వొకేషనల్ మొదటి ఏడాది 493, రెండో ఏడాది 255 మంది హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

కొవ్వూరు డిపో నుంచి సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

8



ఏలేశ్వరంలో క్వారీలు

గుంజేద్దాం!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా అడ్డగోలు సీనరేజీ దోపిడీ
- కాంట్రాక్టు గడువు ఇంకా రెండు నెలలే ఉండడంతో కాసుల కోసం బరితెగింపు
- ఉన్న సమయంలో కోట్లు వెనకేసుకునేలా సీనరేజీ సాకుతో ఎడాపెడా వసూళ్లు
- చెరువులు, పొలాల్లో మట్టి తవ్వుకునే రైతులు, పేదలకూ మినహాయింపు లేదు
- మట్టి తవ్వకానికి కేబినెట్ అనుమతిచ్చినా ఖాతరు చేయకుండా సీనరేజీ దందా
- అనేకచోట్ల రసీదులు సైతం ఇవ్వకుండా కంపెనీ పేరుతో సిబ్బంది నగదు వసూళ్లు
- రౌతులపూడిలో సీనరేజీ పేరుతో దందా చేస్తుండడంపై తిరగబడ్డ లారీ యూనియన్
- అంబాజీపేటలో మట్టి ట్రాక్టర్ల నుంచీ పన్ను వసూలుపై తిరగబడ్డ స్థానికులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ సీనరేజీ పేరుతో ఎడాపెడా దండేస్తోంది.. ఎక్కడికక్కడ జనం ముక్కుపిండి అడ్డగోలుగా దోచేస్తోంది.. సొంత పొలం.. చెరువుల్లోంచి రైతులు, స్థానికులు తట్టెడు మట్టి తీసుకువెళ్తున్నా వాలిపోతోంది.. సీనరేజీ ఫీజులు కట్టాలంటూ రుబాబు చేస్తోంది. ఒకపక్క వాణిజ్యేతర అవసరాలకు రైతులు చెరువుల నుంచి మట్టి తీసుకువెళ్లడానికి ఇటీవల కేబినెట్ అనుమతిచ్చినా తనకేం సంబంధం లేదన్నట్టు దందా చేస్తోంది. ఇంకో రెండు నెలల్లో సంస్థ కాంట్రాక్టు ముగియనున్న నేపథ్యంలో ఈలోపే కోట్లకు కోట్లు దండేసేందుకు బరితెగించేస్తోంది. అనేకచోట్ల రేయింబవళ్లు కంపెనీ పేరుతో సిబ్బంది సీనరేజీ పేరుతో రసీదు లు సైతం లేకుండా నగదు వసూలు చేస్తుండడంతో పలుచోట్ల జనం తిరగబడుతున్న పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖన తప్పించి సుధాకర్ ఇన్‌ఫ్రాకు అడ్డగోలుగా కట్టబెట్టింది. రెండేళ్ల వ్యవధిలో రూ.223 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలనే నెపంతో ఎక్కడికక్కడ పిండేసింది. ప్రభుత్వం మారాక 73 రోజులు కాంట్రాక్టు గడువు పెంచడంతో దందా కొనసాగిస్తోంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చిన్న తరహా ఖనిజాలు, గనులు, క్వారీలు, లేటరైట్, ఇతర గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి గనులశాఖ ఎన్నో ఏళ్లుగా సీనరేజీ వసూలు చేసేది. తద్వారా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆదాయం వచ్చేది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖను తప్పించేసింది. వీటి నుంచి భారీగా నిధులు బొక్కేయడం కోసం పథకం పన్ని ఏకంగా ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టింది. ఎవరికి తెలియకుండా అడ్డగోలుగా 2023 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు కాంట్రాక్టును ఏకంగా సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీకి అప్పగించేసింది. రెండేళ్లపాటు ఈ కాంట్రాక్టు ఉండేలా ఆదేశాలు జారీచేసింది. ఇందుకుగాను రెండేళ్లకు ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లించేసి ఆపై ఎంత వసూలు చేసుకున్నా తనకు సంబంధం లేదన్నట్టు స్పష్టం చేసింది. పైగా రూ.233 కోట్లు ఒకేసారి కాకుండా నెలకు రూ.9.70కోట్ల చొప్పున ప్రభుత్వానికి కట్టేలా వెసులుబాటు కల్పించింది. సదరు కంపెనీ వెనుక ఉన్న ఓ కీలక వైసీపీ నేత చేతికి అధికారం దక్కడంతో రెచ్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో క్వారీలు, మైనింగ్ జరిగే ప్రాంతాలు, చెరువులు, కొండలు ఉన్నచోట్ల ఏకంగా భారీగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ప్రైవేటు సైన్యాన్ని దింపి ప్రతి లారీ నుంచి ముక్కుపిండి సీనరేజీని ఈ కంపెనీ వసూలుచేసింది. ఈ కంపెనీ రాకముందు నెలకు ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు పర్యవేక్షణ లేక, సిబ్బంది కొరతతో పట్టించుకోక రూ.3 కోట్లు కూడా వచ్చేది కాదు. కానీ సదరు ప్రైవేటు సంస్థ ఏకంగా ముక్కుపిండి నెలకు రూ.15కోట్ల వరకు పిండేసింది. ఇలా గతేడాది అసెంబ్లీ ఫలితాలు వచ్చేవరకు ఆడింది ఆట పాడింది పాట అన్నట్టు రెచ్చిపోయి ఉమ్మడి జిల్లాను కుమ్మేసింది. కోట్లకుకోట్ల సీనరేజీ పిండేసింది. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఈ సంస్థ ఆగడాలు ఆగినట్టేనని అంతా భావించారు. అప్పటి ప్రభుత్వం అడ్డగోలుగా కట్టబెట్టిన కాంట్రాక్ట రద్దవడం ఖాయం అని అనుకున్నారు. సుధాకర్ ఇన్‌ఫ్రా సైతం ప్రభుత్వం మారడంతో భయపడి తగ్గింది. మే, జూన్, జూలై నెలల్లో ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూళ్ల నిలిపివేసింది. కానీ మళ్లీ అదే కంపెనీ పైరవీలు నడిపింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మూడు నెలలపాటు సీనరేజీ వసూళ్ల నిలిపివేసినందున ఆ సమయానికి తమకు సీనరేజీ వసూలు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. అటు ప్రభుత్వానికి సీనరేజీ బాకీలు కూడా ఉండడంతో అవి చెల్లించడానికి గడువు పొడిగించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఈనెల నుంచి జూలై 14 వరకు 73 రోజులపాటు సీనరేజీ వసూలు చేసుకునేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. జూలై 14 తర్వాత కాంట్రాక్టు రద్దవుతుందని స్పష్టంచేసింది.

గడువులోగా కుమ్మేద్దాం..

పొడిగించిన గడువు మరో రెండు నెలల్లో ముగియనుండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఇప్పుడు అడ్డగోలుగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో బరితెగించేస్తోంది. ఉన్న తక్కువ సమయంలో ఎక్కువ పిండేసేందుకు వీలుగా దౌర్జన్యాలకు తెగబడుతోంది. ఎక్కడికక్కడ కంపెనీ పేరుతో సిబ్బంది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాహనాల్లో తిరుగుతూ డబ్బులు కట్టాలంటూ చెరువులు, కాలువలు, కొండలు, గుట్టల వద్ద దందాలు చేస్తున్నారు. చేతిలో కనీసం రసీదు పుస్తకం కూడా లేకుండా నగదు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రౌతులపూడిలో కొండల నుంచి గ్రావెల్ తరలిస్తోన్న లారీలను సుధాకర్ ఇన్‌ఫ్రా పేరుతో కొందరు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. రసీదులు లేకుండా డబ్బులు అడుగుతున్నారని లారీ యూనియన్ తిరగబడడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అలాగే కాకినాడ జిల్లా జగ్గంపేట, రౌతులపూడి, పెద్దాపురం మండలాల్లో చిన్నాచితకా క్వారీల నుంచి నల్లరాయి, గ్రావెల్, తూర్పుగోదావరిలో కొండల నుంచి చిన్నపాటి గ్రావెల్, మట్టి... కోనసీమలో చెరువుల నుంచి మట్టి తరలిస్తున్న వారిని సైతం వదలకుండా నగదు డిమాండ్ చేస్తుండడంతో సదరు కంపెనీ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏమాత్రం బిల్లులు లేకుండా అడ్డదారిలో డబ్బులు వసూలు చేయడం ఏస్థాయిలో సీనరేజీ పేరుతో సదరు సంస్థ కోట్లకుకోట్లు దారిమళ్లిస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటు రైతులు వాణిజ్యేతర అవసరాలు చెరువుల్లో మట్టి తవ్వి తరలించుకోవచ్చని ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయినా ఈ కంపెనీ మాత్రం తనకు డబ్బు కట్టాల్సిందేనంటూ బరి తెగించేస్తోంది.

ఆ రూ.24 కోట్ల పేరుతోను..

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో అరబిందో సంస్థకు గత వైసీపీ ప్రభుత్వం ఓ కొండను రాసిచ్చేసింది. కాకినాడ సెజ్‌లో నిర్మిస్తోన్న పోర్టు కోసం ఇక్కడి నుంచి కావలసినంత రాయిని తవ్వుకోవడానికి వీలుగా రూ.71 కోట్ల వరకు సీనరేజీ పన్ను రద్దు చేసేసింది. ఇలా చేయడం వల్ల తనకు రావలసిన ఆదాయానికి గండిపడిందని సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా రూ.24కోట్ల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించలేదు. తాను కట్టాల్సిన బాకీలో ఈ మొత్తం రద్దు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరింది. అయినా పట్టించుకోకపోవడంతో కొత్త ప్రభుత్వం వద్ద పైరవీలు చేసింది. వినకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ మొత్తం డబ్బులు ఒకవేళ తాను కట్టాల్సివస్తే నష్టపోతామనే కారణంతో కాంట్రాక్టు మిగిలి ఉన్న ఈ రెండు నెలల్లో ఎంత వీలైతే అంత అడ్డగోలుగా పిండేయాలని సదరు సంస్థ పన్నాగం పన్నింది. అందుకే ఉమ్మడి జిల్లాల్లో సీనరేజీ పేరుతో నగదు వసూళ్లకు తెగబడుతోంది.

కోనసీమలోనూ అదే తీరు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సెస్ వసూలుకు వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు పొందిన సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పేరిట జరుగుతున్న దందా విమర్శలకు దారితీస్తోంది. ఇటీవల ఓ వివాదం పోలీసుస్టేషన్‌కూ చేరింది. పి.గన్నవరం మండలం నుంచి ఓ రైతుకు చెందిన పొలం నుంచి నల్ల మట్టిని ట్రాక్టర్లపై అంబాజీపేట హైస్కూలుకు తరలిస్తుండగా వాటిని ఆపిన సుధాకర్ ఇన్‌ఫ్రా సిబ్బంది వారికి సొమ్ములు చెల్లించాలని డ్రైవర్లను అడిగారు. దాంతో డ్రైవర్లకు, సంస్థకు చెందిన వారికి మధ్య ఘర్షణ తలెత్తడంతోపాటు వారి ప్రైవేటు వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఆ ట్రాక్టర్ల డ్రైవర్లు, వాటి యజమానిపై పోలీసులు కేసు నమోదుచేశారు. దీంతో తమ పొలంలో మట్టి తీసుకుని తరలిస్తే సెస్ ఎందుకు చెల్లించాలని రైతులు నిలదీస్తున్నారు.

అద్దెల పేరుతో దుబారా!

- జిల్లాలో పలు శాఖల తీరు
- ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నా కిరాయిలు చెల్లింపునకే మొగ్గు
- నెలకు లక్షల్లో ప్రజాధనం వృథా
- కొన్ని శాఖల తీరుపై జనం విస్మయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వృథాను అరికడితే పొదుపు చేసినట్టేనని పెద్దలు చెబుతుంటారు. నిజమే ఆర్థిక పరిస్థితి బాగోని సమయంలో ఆ మాటను పక్కాగా పాటించకపోతే ఇంకా ఇబ్బందుల్లో కూరుకుపోతాం. గత వైసీపీ ప్రభుత్వం పోతూ పోతూ పెద్ద అప్పుల అగాధాన్ని కూటమి ప్రభుత్వానికి అప్పగించింది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టే నాటికి ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా ఉన్నా.. సంక్షోభాల నుంచే అవకాశాలను సృష్టించుకోవాలని చెప్పడమే కాకుండా చేసిచూపించే సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో వృథా ఖర్చులు తగ్గించుకోవాలని, ఉన్నదాంట్లో సర్దుకొని పనిచేయాలని పదే పదే చెబుతూనే ఉన్నారు. కానీ జిల్లా యంత్రాంగానికి మాత్రం ఆ మాటలు పెద్దగా చెవికెక్కడం లేదని ప్రభుత్వ కార్యాలయాలకు చెల్లిస్తున్న అద్దెలు చెబుతున్నాయి. శుభ్రం చేసి సున్నం వేసుకుంటే ఎంచక్కా విధులు నిర్వహించుకొనే అవకాశం ఉన్న భవనాలు కళ్ల ముందు కనబడుతున్నా కొన్ని శాఖల అధికారుల్లో మాత్రం విలాస భవంతి లేకపోతే కులాసాగా పని చేయమనే ధోరణి జనాన్ని విస్మయానికి గురిచేస్తోంది.

● అద్దెల చెల్లింపే సౌఖ్యమట!

జిల్లాల విభజన తర్వాత ఉన్నపళంగా కొత్త ప్రాంతానికి ఫైల్సు సర్దుకొని వచ్చేయాల్సిన పరిస్థితి తెలిసిందే. దీంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలను ప్రారంభించారు. బొమ్మూరులోని న్యాక్ భవనాన్ని కలెక్టరేట్‌కి కేటాయించారు. వాస్తవానికి ప్రజలు వెళ్లడానికి రవాణాపరంగా ఏమాత్రం అనుకూలంగా కలెక్టరేట్ ఉండదు. కానీ తప్పని పరిస్థితుల్లో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. జిల్లా స్థాయి కార్యాలయాలను కొన్నిటిని కలెక్టరేట్‌లో, మరికొన్నిటిని అక్కడికి కాస్త దగ్గరలోని వైటీసీ భవనంలో ఏర్పాటుచేశారు. జిల్లా స్థాయి అధికారుల చాంబర్లు కూడా ఇప్పటికీ చిన్న గదుల్లోనే ఉన్నాయి. అసలు మరుగుదొడ్ల సదుపాయం సరిగా లేదు. ఒక్కసారి ఇంటి నుంచి ఆఫీసుకు వచ్చారంటే భోజనం తెచ్చుకున్నా లేకపోయినా మళ్లీ ఆఫీస్ సమయం అయ్యే వరకూ ఇంటికి వెళ్లే పరిస్థితి ఉండదు. అల్పాహారం తినాలన్నా తిప్పలే. హోటళ్లు ఎక్కడో దూరంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో సైతం అధికారులు నెట్టుకొస్తున్నారు. కొందరు అధికారులు సొంత సొమ్ములతో కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్నారు. ఒక జిల్లా అధికారి కార్యాలయం అయితే నిన్న మొన్నటి వరకూ మేజర్ డ్రైన్ పక్కనే ఉండేది. అయితే, కొందరు అధికారులు ఇలా సర్దుకుపోతుంటే.. మరి కొందరు అధికారులు మాత్రం అద్దె చెల్లించినా ఫర్వాలేదు.. సౌఖ్యాలు ఉండాల్సిందే అంటున్నారు.

● భవనాలు అందుబాటులో ఉన్నా

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ప్రభుత్వానికి చెందిన భవనాలు చాలా ఉన్నాయి. అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని భవనాలకు సున్నంవేసి, శుభ్రం చేయించుకుంటే వినియోగించుకోవచ్చు. సెంట్రల్ జైలు ఎదురుగా ఆర్అండ్‌బీకి చెందిన భవనాలు చాలా ఉన్నాయి. కంబాల చెరువు సమీపంలో దాదాపు పూర్తి కావొచ్చిన భవనం ఉంది. ఫైర్ ఆఫీస్ పక్కన రైల్వేకి చెందిన భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇవి ప్రజల రాకపోకలకు కూడా సౌకర్యవంతంగా ఉంటాయి. వీటికి స్వల్ప మొత్తంలో నిధులు కేటాయిస్తే లక్షల్లో ప్రజల సొమ్ము ఆదా అవుతుంది. కానీ అదేమీ కొందరు అధికారులకు పట్టడం లేదు. ఉదాహరణ కు ఎక్సైజ్ జిల్లా కార్యాయం దానవాయిపేటలోని ఓ భవనంలో ఏర్పాటుచేశారు. ఈ భవనానికి సుమారు రూ.40 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఎక్సైజ్ జిల్లా కార్యాలయానికి ప్రజల రాకపోకలు ఉండవు. కానీ వైటీసీలో కేటాయించిన మూడు గదులు కాదని.. నగరంలో ఓ విలాసవంతమైన భవంతిని అద్దెకు తీసుకు న్నారు. తక్కువ అద్దెకు దొరికే ప్రాంతాలు ఉన్నా హోదాకు తగినట్టుగా ఉండాలని రిచ్ ఏరియాని ఎంచుకొన్నారు. అలాగే అర్బన్ తహశీల్దారు కార్యాలయం పక్కన రిజిస్ట్రేషన్ల శాఖకు సొంత భవనం ఉంది. దానిని పాడుబడిన భవనంగా చేయడంలో భాగంగా వదిలేసి అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 11 ఎస్ఆర్‌వో, 2 ఆర్‌వో కార్యాలయాలు ఉండగా 11 కార్యాలయాలకు అద్దెలు కడుతున్నారు. రాజమహేంద్రవరంలోని రిజిస్ట్రారు కార్యాలయానికి ఏకంగా రూ.50 వేలు, జిల్లా రిజిస్ట్రారు కార్యాలయానికి రూ.24 వేలు అద్దెలుగా చెల్లిస్తున్నారు. జిల్లా మైన్స్ కార్యాలయం లాలాచెరువు సమీపంలోని ఓ భవనంలో ఉంది. దీనికి సుమారు రూ.50 వేలు అద్దె కడుతున్నారు. కానీ చాలా మటుకు అక్కడ ఒక అటెండర్ మాత్రమే దర్శనమిస్తారు. గదుల్లోని కుర్చీలన్నీ ఖాళీగా ఉంటాయి. అధికారులు కలెక్టరేట్ నుంచి పనిచేస్తుంటారు. ఈ విషయంలో అర్బన్ తహశీల్దారు కార్యాలయాన్ని మెచ్చుకొని తీరా ల్సిందే. ఇది విధులు నిర్వర్తించడానికి ఏమాత్రమూ సదుపాయంగా ఉండదు. వర్షాకాలం వచ్చిందంటే పడవల్లో ఆఫీసుకు చేసుకొనే పరిస్థితి ఉంది. సీలింగ్ నుంచి వర్షం నీరు ధారాపాతంగా కారుతుంది. ఏళ్ల తరబడి ఆ కార్యాలయంతోనే వేగుతున్నారు.

● లెక్కలు లేవు

జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వాటి అనుబంధ శాఖలకు సంబంధించి 50 వరకూ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో చాలా మటుకు జిల్లా కలెక్టరేట్, వైటీసీ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కానీ కొన్ని శాఖల కార్యాలయాలు మాత్రం అద్దె భవనాల్లో ఉన్నాయి. ఎన్ని అద్దె భవనాల్లో ఉన్నాయి, వాటికి నెలకు ఎంత జనం సొమ్ము అద్దెలుగా చెల్లిస్తున్నారనే లెక్కలు స్పష్టంగా లేని పరిస్థితి ఉంది. ఏ శాఖకు చెందిన బడ్జెట్‌లో ఆ శాఖ చెల్లించుకుంటుందని, అందువల్ల జిల్లా కలెక్టరేట్‌లో కూడా వివరాలు ఉండవనే సమాధానం ఎదురవుతోంది. కలెక్టర్ ప్రశాంతి అద్దెల పేరుతో దుబారాపై దృష్టి సారించాలనే వాదన వినవస్తోంది. అందుబాటులో ఉన్న భవనాలను శిథిలాలకు వదిలేయకుండా బాగు చేయించి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే జనం సొమ్ము పెద్ద ఎత్తున ఆదా అయ్యే అవకాశం ఉంది.



మన్యం వీరుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న వాసు, సోము

అల్లూరి పోరాటం.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

● అల్లూరి, మన్యం వీరుల విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు

8

నవోదయం 2.0లో పురోగతి సాధించాలి : జేసీ



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ చిన్న రాముడు

రాజమహేంద్రవరం,మే14(ఆంధ్రజ్యోతి): ఇటీవలకాలంలో యువత, పిల్లల్లో, స్కూల్, కళాశాల విద్యార్థుల్లో మత్తు పదార్థాల వినియోగం ఆందోళన కలిగిస్తోందని, మద్యం, నిషేధిత మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నవోదయం 2.0లో పురోగతి సాధించాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. బుధవారం ఎక్సైజ్ అధికారులతో ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మద్యం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికోసం వివిధ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నవోదయం అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొన్న వారి సంఖ్య, డీ-ఎడిక్షన్ సెంటర్లలో చేరిన వారి సంఖ్య, విజయవంతంగా పునరావాసం పొందిన వారి సంఖ్య హేతుబద్ధతతో విశ్లేషణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈపీవో లావణ్య, అదనపు ఎస్పీ (శాంతి భద్రతలు) డి.సుబ్బరాజు, డీఎస్ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వామా సిబ్బందికి అందని జీతాలు

రాజమహేంద్రవరం రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో పనిచేసే అధికారులు, సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న అటెండర్లు మొదలుకొని హెచ్ఆర్ పాలసీ కింద పనిచేసే టీఏలు, ఈసీలు, ఏపీవోలు ఇతర సిబ్బంది కలిసి 400 మంది ఈ శాఖ పరిధిలో పనిచేస్తున్నారు. వీరికి మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి జీతాలు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ధర్నా.. విజయవంతం



విజయవాడ ధర్నా చౌక్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల సమస్యలపై విజయవాడలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ధర్నా విజయవంతమైనట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు తెలిపారు. పాఠశాలల్లోని అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం విజయవాడ ధర్నా చౌక్‌లో ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 21తో కూటమి ప్రభుత్వం కంటే వైసీపీ ప్రభుత్వమే మేలు అనే ఉద్దేశం ఉపాధ్యాయులలో కలుగుతుందన్నారు. 12వ పే రివిజన్ కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్నమూడు కరువు భత్యాలు వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్నిరకాల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని, ప్రస్తుతం ప్రతిపాదించిన తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు, తాళ్లపూడి, గోపాలపురం, చాగల్లు, బిక్కవోలు, నిడదవోలు పట్టణ, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు వై. శంకరం, శోభన్‌బాబు, నాగరాటాలు, షేక్ సలీం, వీరాస్వామి, ధనరాజు, థామస్, విష్ణు , తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



రూ. ఐదు లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన గుళ్లపూడి వీర వెంకట సత్యనారాయణకు విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన నష్టపరిహారం చెక్కు రూ. ఐదు లక్షలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం అందజేశారు. 2023 డిసెంబర్ 26వ తేదీన తాళ్లపూడి మండలానికి చెందిన గుళ్ళపూడి వీర వెంకట సత్యనారాయణ (44) విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీనిపై విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన నష్టపరిహారాన్ని బుధవారం మృతుని భార్య గుళ్ళపూడి శైలజకు అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, జీవీ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సృజనాత్మకతపై దృష్టిపెట్టాలి



చాగల్లులో చిన్నారులతో ఉన్న ఐసీడీఎస్ సీడీపీవో మమ్మీ

చాగల్లు, మే 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసే విధంగా ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో డీ. మమ్మీ అన్నారు. బుధవారం స్థానిక 67,68, 69,70 కేంద్రాల్లోని చిన్నారులతో ప్రత్యేక మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్ పీ. పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను శారీరక, మానసిక భావోద్వేగాలను అభివృద్ధి చేసి వారిలో నైపుణ్యం పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, జీఎంఎస్‌కే దుర్గాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలి: డీఎస్పీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల సెల్‌ఫోన్లలో శక్తి యాప్ కచ్చితంగా ఉండాలని శక్తి టీం జిల్లా నోడల్ అధికారి, మహిళా పీఎస్ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. నగరంలోని అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాలలో మహిళలపై జరుగుతున్న నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

'ఆర్‌అండ్‌బీ డివిజన్ కార్యాలయాన్ని తరలించొద్దు'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్ అండ్ బీ డివిజన్ కార్యాలయం కొవ్వూరు నుంచి తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి. గిరిప్రసాద్ వర్మ అన్నారు. బుధవారం కొవ్వూరు పరిసర ప్రాంతాల్లో ఏపీజీఈఏ జిల్లా కమిటీ పర్యటించి, జూన్ 5వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గురువారం ఉదయం సీఎం చంద్రబాబుని స్వయంగా కలిసి కార్యాలయం తరలిపోకుండా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి. గిరి ప్రసాద్‌వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకై నిర్వహిస్తున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు జిల్లా నుంచి వేలాదిగా ఉద్యోగులు తరలిరావాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం మాట్లాడుతూ ఏపీజీఈఏ రాష్ట్ర, జిల్లా శాఖలు నిర్వహించే కార్యక్రమాలలో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనడం వల్లే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు డి. చాంబర్లిన్, ఉపాధ్యక్షులు ఎం. కమల్‌సుందర్, కొవ్వూరు ఏపీజీఈఏ అధ్యక్షుడు ఎం.దుర్గాప్రసాద్, శ్రీనివాసరాజు, బి.దుర్గారావు, మహిళా విభాగం నేత అనిత, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన జవహర్



లోకేశ్‌తోపాటు ఉన్న మాజీమంత్రి జవహర్, ఆశీష్‌లాల్

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కేఎస్ జవహర్, అతని తనయుడు కొత్తపల్లి ఆశీష్‌లాల్ బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్మిక వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీమన్నారాయణ

దేవరపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంలో గత ఆరురోజులుగా మెరుగైన వేతనాల కోసం సమ్మె చేస్తున్న కార్మిక శిబిరాన్ని సుప్రీంకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 2025 జాతీయ స్థాయి వేతనాల కమిటీ సిఫార్సుల మేరకు కార్మికులకు వేతనాలు పెంచాలని, ఎర్త్‌మూవర్స్ కార్మికులు స్కిల్డ్ పరిధిలోకి వస్తారని ఈ విషయం గమనించి వారికి మెరుగైన వేతనాలు పెంచుతూ యాజమాన్య సంఘం వేతన ఒప్పందం జరపాలన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు నాగేశ్వరరావు, వివిధ కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పంగిడిలో జవహర్‌కు ఘన స్వాగతం

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి కేఎస్ జవహర్‌కు గురువారం పంగిడిలో ఘన స్వాగతం పలకనున్నట్టు టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి బూరుగుపల్లి రాఘవులు తెలిపారు. ఆ సాయంత్రం నాలుగు గంటలకు పంగిడి నుంచి కాపవరం, దొమ్మేరు మీదుగా పట్టణంలోని విజయవిహార్ సెంటర్ మీదుగా ర్యాలీగా ఆయన నివాసానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'ఆపరేషన్ సిందూర్‌తో దేశ సత్తా చాటారు'

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌తో దేశ సైనిక శక్తి పరాక్రమాన్ని ప్రపంచానికి చూపిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన కొవ్వూరులో మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి మోదీ ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకార చర్య చేపట్టి అంతం చేసిందన్నారు.

నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

తాళ్లపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 15వ తారీఖు ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు.

జనసైనికులకు క్రియాశీలక సభ్యత్వ కార్డుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న డీ.సువర్ణరాజు

దేవరపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో బుధవారం డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రియాశీలక సభ్యత్వ నమోదుతో పాటు ఐడీకార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ప్రతి జనసైనికుడు క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పార్టీ తరపున ఉపయోగపడాలనే ఉద్దేశంతో అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దీన్ని ప్రారంభించారన్నారు. ఇప్పటివరకు గోపాలపురం నియోజకవర్గంలో ఎనిమిది వేల మంది సభ్యత్వాన్ని నమోదు చేయించుకున్నారన్నారు. అనంతరం సభ్యత్వ ఐడీకార్డులను జనసైనికులకు అందజేశారు. జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు కౌలూరి సత్తిబాబు, ఐటీ కోఆర్డినేటర్ ఉన్నమట్ల సత్య, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, గుడిసె వెంకటరత్నం, సిద్దా తాతాబ్బాయి, బాబు, మహంకాళి, తోట నాగేశ్వరరావు, వరుణ్, తేజ, పోలుమాటి నాని పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్.. వరం లాంటిది

గోపాలపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ నిధులు వరంలా పనిచేస్తాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం గోపాలపురం మండలం కొవ్వూరుపాడుకు చెందిన మనుపూడి దుర్గ క్యాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయం అందజేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి రూ. 3.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



సచివాలయం వద్ద దుర్గ కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

కొవ్వూరు డిపో నుంచి సరస్వతి పుష్కరాలకు బస్సు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ కుమార్

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి నది పుష్కరాలకు కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రప్రథమంగా సరస్వతి ధామం పుష్కర యాత్రా స్పెషల్ బస్సును పంపించినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. బుధవారం కొవ్వూరు డిపో నుంచి సరస్వతి పుష్కరాలకు యాత్రా స్పెషల్‌ను ప్రారంభించారు. డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ ఈ స్పెషల్ బాసర, జ్ఞాన సరస్వతీ దేవి, ద్రోణ త్రివేణి సంగమం (గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు)లో పుణ్యస్నానం, ధర్మపురి, శ్రీలక్ష్మీ నరసింహస్వామి, కాళేశ్వరం మహాకాళేశ్వరుడు, సరస్వతీ నదిలో పుణ్యస్నానం, కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి, వరంగల్ భద్రకాళీమాత, రామప్ప దేవాలయ దర్శనం అనంతరం ఈనెల 14వ తేదీ ఉదయం చేరుకుంటుందన్నారు. అలాగే ఈ నెల 19వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు కొవ్వూరు డిపో నుంచి ఇంద్ర ఏసీ బయలుదేరుతుందన్నారు. టిక్కెట్టు ధర రూ. 3800 మాత్రమేనన్నారు. ఇంకా 20 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సీట్లు కావాల్సిన వారు 7382907952 నంబరును సంప్రదించాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. యాత్రా స్పెషల్‌తో పాటు విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు ఇస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు నిడదవోలు నుంచి ..

నిడదవోలు, మే 14 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి సరస్వతి నది పుష్కరాలకు గురువారం నుంచి సరస్వతి ధామం పుష్కర యాత్ర ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బాసర, ధర్మపురి, కాళేశ్వరం, కొండగట్టు, వరంగల్, రామప్పగుడి, కాళేశ్వరంలో పుష్కరస్నానాలు ఉంటాయన్నారు. ఈ మూడు రోజులపాటు జరిగే యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులు వెళతాయని చెప్పారు. ఒక్కొక్కరికి రూ. మూడు వేలు టికెట్ ధర నిర్ణయించామని, మరిన్ని వివరాలకు 9849973130, 9100954632 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



అన్నవరప్పాడులో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

పెరవలి, మే14(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడు వెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. మొత్తం 69 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ. ఏడు లక్షల 14 వేల 380 , అన్నదాన హుండీ ద్వారా రూ. 16 వేల 903... మొత్తం రూ. ఏడు లక్షల 31 వెయ్యి 283 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రాధాకృష్ణ తెలిపారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీపర్రు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, దాతలు, శ్రీవారి సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లు మార్గదర్శకాలు అనుసరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత

నిడదవోలు, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి నేరుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అను సరించి ఉండాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి రాణీసుస్మిత అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్‌తో ధాన్యం కొనుగోలుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాకు నిర్దేశించిన 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని నిర్దేశించడం జరిగిందన్నారు. అలాగే ఆయా మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో విధిగా బి.ఆర్జి స్థరులో సంబంధిత లావాదేవీల వివరాలు నమోదు చేయాలన్నారు. ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంఆర్ఆర్ ప్రేమ్‌కుమార్, తహశీల్దార్ బి.నాగరాజు నాయక్, మిల్లర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ఎస్.రమేష్, మిల్లర్లు పాల్గొన్నారు.

నూతన క్వారీ అండ్ క్రషర్ అసోసియేషన్ ఎన్నిక



అనిల్‌ను సన్మానిస్తున్న క్వారీ క్రషర్ యాజమానులు

దేవరపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): క్వారీ క్రషర్ యాజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన క్వారీ అండ్ క్రషర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంద్రూ అనిల్ పేర్కొన్నారు. దేవరపల్లి కాకర్ల ఫంక్షన్‌హాలులో ది వెస్ట్ గోదావరిక్వారీ అండ్ క్రషర్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ బుధవారం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ఏకగ్రీవమైంది. గౌరవ అధ్యక్షుడిగా పొట్లు సోమేశ్వరరావు, అధ్యక్షుడిగా ఆంద్రూ అనిల్, ఉపాధ్యక్షులుగా ముదునూరి సూర్యనారాయణ రాజు, పేపకాయల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దొనెల్లి మధుబాబు, కోశాధికారిగా కోట్ల కనకేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడుసంవత్సరాల పాటు ఉంటుందన్నారు.

అనంతరం నూతనంగా ఎంపికైన కమిటీని క్వారీ అండ్ క్రషర్ యాజమానులు అభినందనలు తెలిపారు.

పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

రాజమహేంద్రవరం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమని రూరల్ గ్రామాల స్పెషల్ ఆఫీసర్ , రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బుధవారం రూరల్ మండలంలోని హకుంపేట, శాటిలైట్ సిటీ గ్రామాలలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా డ్రైనేజీ సిస్టం ప్రణాళికను పటిష్టంగా అమలు పరచవలసిందిగా సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు వందశాతం కనెక్షన్లు నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. సచివాలయాల పరిధిలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టవలసిన పనులను గుర్తించేందుకు ఓ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. చివరి కాలనీ వరకు పర్యటించి ఏఏ ప్రాంతాలలో డ్రైయిన్లు, రోడ్లు నిర్మించాలో సమగ్ర నివేదిక సిద్ధం చేసి తనకు అందజేయాలని అదేవిధంగా రోడ్డుపైకి ఇరువైపుల ఎక్కడా చెత్తకుప్పలుగా ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలు, తాగునీరు పారిశుధ్య సమస్యలను గుర్తించామని వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

హ్యూమన్‌రైట్స్ కమిషన్ సభ్యురాలు పర్యటన

తాళ్లపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి బుధవారం ప్రక్కిలంకలో పర్యటించారు. గ్రామంలో నిర్మిస్తున్న సూర్య దేవాలయ నిర్మాణ స్థలానికి సంబంధించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, బీజేపీ నాయకులు పిల్లలమర్రి మురళీకృష్ణ, ఓలేటి సత్యనారాయణ, ఆర్‌ఐ రామకృష్ణ, ఎస్‌ఐ రామకృష్ణ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

• కంబాలచెరువు వద్ద సీతారామరాజు విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరంసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి) :బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన వీరోచిత పోరాటం భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం కంబాలచెరువుచిరంజీవి పా ర్కును రూ.కోటీ 25లక్షలతో అభివృద్ధిచేసి అక్క డ ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, ఆ యన అనుచరులు మన్యంవీరుల విగ్రహాలను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మన్యం వీరు డు అల్లూరి సీతారామరాజుతో రాజమహేంద్రవరానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాం తాలలో ఆయన సంచరించారని గుర్తుచేశారు. అటువంటి పోరాటయోధుల విగ్రహాలను చూసి భవిష్యత్‌తరాలు స్ఫూర్తినొందాలని మన్యం వీరుల విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.75లక్షలు, రూడా నుంచి మ్యాచింగ్ ఫండ్స్ రూ.50లక్షలు కలిపి మొత్తం రూ.కోటి 25లక్షలతో పార్కు అభివృద్ధి చేశామన్నారు. చిరంజీవి పార్కుకు చరి త్ర ఉందన్నారు. గతంలో ఈ పార్కును అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి ప్రారంభించాల్సివుండగా కొన్ని అనివార్యకారణాల వల్ల పార్కు ప్రారంభం కాలేదన్నారు. అప్పటి నుంచి ఈపార్కు బాగోగులు చిరంజీవి అభిమానులే చూస్తున్నారని చెప్పా రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పార్కును అభివృద్ధి చేశామన్నారు. అదేవిధంగా అమృత పథకం 2.0లో కేంద్రం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు గ్రాంటు కేటాయించిందని అం దులో రాజమహేంద్రవరానికి రూ.200 కోట్లు కేటాయించిందని, ఇది శుభపరిణామమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడిన యోధుడు అల్లూ రి అని అన్నారు. అల్లూరి సీతారామరాజు తోపా టు మన్యంవీరుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటుచేయడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరీకరణ అనేది చాలా వేగంగా జరుగుతుందన్నారు. పట్టణాలకు పల్లె ప్రాంతాల నుంచి ప్రజలు నివాసానికి వస్తున్న తరుణంలో పార్కులను, స్పోర్ట్సుకు సంబంధించిన ఇన్‌ఫ్రాస్టక్చర్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా రుడా, నగరపాలక సంస్థ అథారిటీ వారికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి పేరున ఉన్న పార్కును ప్రారంభించామన్నారు. జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను మాట్లాడుతూ 2002లో మెగాస్టార్ చిరంజీవి ఇదే పార్కులో ప్రస్తుతం ఉన్న మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించలేని విధంగా అభిమాను లు కిక్కిరిశారని ఆనాటి రోజును గుర్తుచేశారు..

తారెత్తిస్తున్న ఎండలు

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు తారెత్తిస్తున్నాయి. దీంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇళ్లకే పరిమితమై ఫ్యాన్‌లు, ఏసీలతో సేద తీరుతున్నారు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

• క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన బుధవారం ఆరికిరేవులలో చోటుచేసుకుంది. గ్రామదేవత పాశాలమ్మ ఆలయ సమీపం గోదావరి గట్టుపై కొవ్వూరు వైపు నుంచి తాళ్లపూడి వెళ్తున్న ఇసుక లోడ్ టిప్పర్ లారీ, తాళ్లపూడి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ (రెండులారీలు) ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌కి స్వల్పగాయాలు కాగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో కొవ్వూరు తాళ్ళపూడి గోదావరి ఏటిగట్టు రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆరికిరేవుల జాతర బందోబస్తు నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను ఆరికిరేవుల గ్రామంలోంచి బయటకు మళ్ళించారు. పోలీసు, ఫైర్ అధికారులు, జేసీబీ సహాయంతో లారీ క్యాబిన్‌లో ఇర్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయపడిన ఇరువురు డ్రైవర్లను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.